సమాజహితం

WWW.SAMAJAHITHAM.COM | PRGI : T/TG/2026/0819/5664/1384



సంపుటి: 01 సంచిక: 10 సమాజహితం - తెలుగు దినపత్రిక ఎడిటర్: హరీష్ ఆచార్య ఆదివారం 15-11-2026 పేజీలు: 06 వెల: రూ.2.00



తెలంగాణ గిగ్ వర్కర్లకు గుడ్‌న్యూస్..

రూ.5 లక్షల బీమా, రూ.10

- సంక్షేమ పథకాన్ని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభం
- ఈ పథకం కింద రూ.5 లక్షల జీవిత బీమా
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం
- హైదరాబాద్‌లో జరిగిన సభకు ముందు గిగ్ వర్కర్ల భారీ బైక్ ర్యాలీ
- అనంతరం గిగ్ వర్కర్లతో రాహుల్ ముఖాముఖి

హైదరాబాద్, : తెలంగాణలో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వారికి రూ.5 లక్షల జీవిత బీమాతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం అందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని జయభేరీ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' విధివిధానాలను ఆయన ప్రారంభించారు.

2వ పేజీలో...



గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం..

ప్రతి డెలివరీపై 1 శాతం నగదు జమ

- తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన రాహుల్ గాంధీ
- ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడి
- రూ.5 లక్షల ప్రమాద బీమా, పింఛన్, సామాజిక భద్రత కల్పిస్తామని హామీ
- పని, ఆదాయ వివరాలు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉంటాయని వెల్లడి
- వైఫైతో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తామని హామీ

హైదరాబాద్: గిగ్ వర్కర్ల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా, వారి హక్కులు, సంక్షేమానికి భరోసా కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు.



జనవరి నుంచి పల్లె యాత్రకు సిద్ధం..!

2వ పేజీలో...

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సరికొత్త పరిపాలనా వ్యూహాలకు, పొలిటికల్ నెరేటివ్‌కు తెరలేపారు. రాబోయే సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ స్వయంగా సందర్శించేలా ప్రజాబలం పేరుతో ఒక భారీ మాస్ కనెక్ట్ కార్యక్రమాన్ని ఆయన సిద్ధం చేసుకున్నారు. కేవలం సచివాలయంలోని ఏసీ గదులు, రివ్యూ మీటింగ్‌ల అధికార దర్పానికి పరిమితం కాకుండా, నేరుగా అట్టడుగు వర్గాల వద్దకు వెళ్లే 'మాస్ లీడర్'గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం మరియు కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో చెక్కుచెదరని విశ్వసనీయతను పెంచడం ఈ పల్లెబాట ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి ప్లాన్ చేసుకున్న ఈ వ్యూహంలో రెండు స్పష్టమైన పొలిటికల్ యాంగిల్స్ ఉన్నాయి. మొదటిది క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజా అవసరాలను నేరుగా తెలుసుకోవడం మరియు ఎల్లనినో ప్రభావంతో తలెత్తిన తాగు, సాగునీటి పర్యవేక్షణపై చర్యలు తీసుకోవడం ద్వారా సమ్మేళన సంక్షేమ ముద్రను సాధించడం.



ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి చంద్రబాబు, లోకేష్ కారణం

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

అమరావతి : చిత్తూరులోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి చంద్రబాబు, నారా లోకేష్ కారణమని వైసీపీ అధ్యక్షుడు , మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులకు ఉరితాడు దిక్కవుతుందని, ఈ దారుణమైన పరిస్థితికి ముమ్మాటికీ మీరే బాధ్యులంటూ ట్విటర్‌లో విమర్శించారు. ఇదే కాలేజీలో గతంలో కూడా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటూ విద్యార్థులు రోడ్డెక్కి తమ ఆవేదనను, ఆగ్రహాన్ని వెళ్ల గక్కినా టాపిక్ డైవర్ట్ చేసే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. ఇంత దుర్మార్గమైన పాలన గతంలో ఎప్పుడూ చూడలేదని వెల్లడించారు.

2వ పేజీలో...



- అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన గిరిబాబు
- గిరిబాబు వయసు 80 సంవత్సరాలు
- 600కి పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు

టాలీవుడ్ లో విషాదం..

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత


హైదరాబాద్: తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్ కొండాపూర్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో టాలీవుడ్ పరిశ్రమలో విషాద ఛాయలు అలముకున్నాయి. గిరిబాబు పూర్తి పేరు యర్రా శేషగిరిరావు. ఆయన 1946 జూన్ 8న ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించారు. చిన్నతనం నుంచే నాటకాలు, కళారంగంపై ఉన్న ఆసక్తితో ఆయన సినిమా రంగం వైపు అడుగులు వేశారు.

మేకెదాటు డ్యామ్ వివాదంపై..

కర్ణాటక, తమిళనాడు కాంగ్రెస్ మధ్య అంతర్గత పోరు



బెంగళూరు: కావేరీ నదిపై ప్రతిపాదిత మేకెదాటు డ్యామ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. కర్ణాటక, తమిళనాడు కాంగ్రెస్ మధ్య అంతర్గత పోరును ప్రధాని పర్యటన బయటపెట్టింది. ప్రధాని మోదీ శుక్రవారం కర్ణాటకలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేకెదాటు ప్రాజెక్టుకు చట్టబద్ధమైన అనుమతులను వేగవంతం చేయాలని..



తిరుమల వేంకటేశుడికి రూపమిచ్చిన చిత్రకారుడు శ్రీనివాసన్ కన్నుమూత

- తమిళనాడులోని కోవిల్పట్టిలో వృద్ధాప్యంతో మృతి
- 1970లో టీటీడీ ఆహ్వానంతో గర్భగుడిలో స్వామిని చూసి చిత్రాలు గీసిన శ్రీనివాసన్
- ఆభరణాలతో, ఆభరణాలు లేకుండా రెండు రూపాల్లో చిత్రాలు
- ఇంటింటా పూజలందుకుంటున్న ఆయన చిత్రాలు

తిరుమల: ఇంటింటా పూజలందుకుంటున్న తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రానికి ప్రాణం పోసిన ప్రఖ్యాత చిత్రకారుడు ఎస్.ఎం. శ్రీనివాసన్ (86) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా కోవిల్పట్టిలోని తన స్వగృహంలో గురువారం తుది శ్వాస విడిచారు. తమిళనాడుకు చెందిన శ్రీనివాసన్, పదో తరగతి వరకు చదివి ప్రముఖ చిత్రకారుడు కొండయ్య రాజు వద్ద చిత్రకళలో శిక్షణ పొందారు. ఆయన ప్రతిభను గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) 1970లో ప్రత్యేకంగా ఆయనను ఆహ్వానించింది. గర్భగుడిలోని మూలవిరాట్టును నేరుగా దర్శించి, స్వామివారి దివ్య రూపాన్ని ఆయన తన కుంచెతో చిత్రించారు. స్వామివారు సర్వాభరణాలతో అలంకరించుకున్న రూపం ఒకటి, ఆభరణాలు లేకుండా ఉన్న నిరాడంబర రూపం మరొకటి.. ఇలా రెండు రకాల అద్భుతమైన చిత్రాలను ఆయన గీశారు. ఈ చిత్రాలు అనతికాలంలోనే భక్తుల్లో అశేష ప్రాచుర్యం పొందాయి.

2వ పేజీలో...



కవిత పార్టీ సత్తా చాటుతుందా..?

వరంగల్, : తెలంగాణ రక్షణ సేన ఏర్పాటు తర్వాత తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్న కల్వకుంట్ల కవిత.. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరును అభ్యర్థులుగా ప్రకటించారు. బీసీ వర్గానికి చెందిన విద్యార్థి నాయకులకు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. 75 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ తనయ.. కల్వకుంట్ల కవిత తొలిసారిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఆమె తన పార్టీ తరఫున అభ్యర్థులను ప్రకటించి, ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరులను కవిత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలోకి దించారు.

జనవరి నుంచి పల్లె యాత్రకు సిద్ధం..!

మొదటిపేజీ తరువాయి...

ఇక రెండవది, అత్యంత కీలకమైనదిశాసనసభ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ లోపాలను ఆధారాలతో సహా ఎండగట్టడం ద్వారా కేసీఆర్ నిర్మించుకున్న 'నీటిపారుదల రథసారథి' బ్రాండ్ ఇమేజ్‌ను శాశ్వతంగా బద్దలు కొట్టడం. కేసీఆర్ బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల వేదికను సిద్ధం చేస్తున్న రేవంత్.. ప్రత్యక్ష సభ ద్వారా కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన ఆర్థిక, సాంకేతిక లోపాలను ప్రజాక్షేత్రంలో పెట్టాలని భావిస్తున్నారు. బిఆర్ఎస్ తమ హయాంలో సాధించిన అతిపెద్ద విజయంగా చెప్పుకునే కాళేశ్వరాన్ని వైఫల్యాల కాళేశ్వరం గా మార్చడం ద్వారా ప్రతిపక్షాల విమర్శల దాడికి మూలాల్లోనే గండికొట్టాలనేది తాడేపల్లి–హైదరాబాద్ పొలిటికల్ డిజైన్. అసెంబ్లీలో కేసీఆర్ మార్క్ ప్రాజెక్టుల గుట్టు విప్పి, పల్లెల్లో ప్రజాబలం ద్వారా ప్రజలను మమేకం చేయడం ఈ రెంటెడ్ వ్యూహంఅదే సమయంలో, పల్లెబాట ద్వారా కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణాలను చక్కదిద్దే దిశగా కూడా అడుగులు పడుతున్నాయి. మంత్రివర్గంలో లేదా క్షేత్రస్థాయిలో ఉన్న చిన్నపాటి అసమ్మతి సెగలను అణచివేయడానికి, కేడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ఈ పల్లెబాట ఒక పొలిటికల్ ఎనర్జీ బూస్టర్‌లా పనిచేయనుంది. స్థానిక సంస్థలు మరియు భవిష్యత్ ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలంటే స్వయంగా ముఖ్యమంత్రే గ్రౌండ్‌లోకి దిగి పర్యటించడం కంటే వేరే మార్గం లేదు. కేటీఆర్, హరీష్ రావు వంటి బిఆర్ఎస్ అగ్రనేతలు ప్రభుత్వంపై



పదే పదే చేస్తున్న దాడిని ఎదుర్కొనేందుకు రేవంత్ రెడ్డి ఎంచుకున్న ఈ 'డ్యూయల్ ఆపరేషన్' కాంగ్రెస్ పార్టీకి గట్టి రక్షణ కవచంగా మారనుంది. సచివాలయ పరిపాలనకు, గ్రామీణ ప్రజాక్షేత్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా ప్రజలు తమకు ఇబ్బంది వచ్చినప్పుడు ఆదుకునే నేతగా రేవంత్‌ను చూసే వాతావరణాన్ని కల్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

సంక్రాంతి తర్వాత ప్రారంభం కానున్న 'ప్రజాబలం' పల్లెబాట తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. ఒకవైపు అసెంబ్లీ వేదికగా కాళేశ్వరంపై బీఆర్ఎస్ నెరేటివ్‌ను తిరగరాయడం, మరోవైపు పల్లెల్లో శ్రేణులను ఏకం చేస్తూ ప్రజామోదాన్ని పెంచుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి తెలంగాణలో తన రాజకీయ స్థానాన్ని మరింత తిరుగులేనిదిగా మార్చుకోవడానికి సుదీర్ఘమైన స్కెచ్ వేశారు

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం..



మొదటిపేజీ తరువాయి...

ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

కంపెనీలకే అనుకూలంగా కేంద్ర విధానాలు: గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇప్పటివరకు అందుబాటులో లేదని, తమ శ్రమకు ఎంత ప్రతిఫలం వస్తోందనే విషయంలోనూ స్పష్టత లేదని రాహుల్ గాంధీ అన్నారు. గతంలో వారి సంక్షేమంపై జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీని ఇప్పుడు నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కంపెనీలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని విమర్శించారు. గిగ్ వర్కర్లను మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ వెట్టిచాకిరీ కార్మికులుగా మార్చాలని చూస్తున్నాయని ఆరోపించారు.

వారిని బానిసలుగా మార్చి దోపిడీ చేయాలనుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్మికులను సేవకులుగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ఫోన్‌లోనే పని, ఆదాయ వివరాలు: గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించడమే కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని రాహుల్ తెలిపారు. ప్రతి డెలివరీకి సంబంధించిన వివరాలు, చేసిన శ్రమ, దానికి లభించే ప్రతిఫలం నేరుగా వారి మొబైల్ ఫోన్లలోనే అందుబాటులో ఉంటాయని చెప్పారు. గిగ్ వర్కర్ల సౌకర్యార్థం వైహై వసతితో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రమాదాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు గిగ్ వర్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొత్త చట్టం ద్వారా రూ. 5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. పింఛన్, సామాజిక భద్రత, పొదుపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని గిగ్ వర్కర్ల బోర్డు ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్మికుల హక్కులు, వారి కుటుంబాల విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

కర్ణాటక, తమిళనాడు కాంగ్రెస్ మధ్య అంతర్గత పోరు

మొదటిపేజీ తరువాయి...

ఆ రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న సీఎం డీకే శివకుమార్ కేంద్రాన్ని కోరారు. 'సార్, మీరు ఇప్పుడే కావేరిపై ఆనకట్టను చూశారు. కర్ణాటకలో మేకెదాటును నిర్మించాల్సిందేనని, దానిని ఎవరూ ఆపలేరని సుప్రీంకోర్టు మనందరికీ స్పష్టమైన తీర్పు ఇచ్చింది. మీరు మాకు చట్టపరంగా సహాయం చేయాలని మేం కోరుతున్నాం' అని ప్రధాని మోదీతో ఆయన అన్నారు. కాగా, తమిళనాడులో సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆ రాష్ట్ర కాంగ్రెస్ మేకెదాటు ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఈ నేపథ్యంలో కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలను తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ శనివారం తీవ్రంగా విమర్శించారు. 'కర్ణాటక ముఖ్యమంత్రి మొండి వైఖరిని కొనసాగిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పును, కావేరీ జల వివాదాల ట్రిబ్యునల్ ఇచ్చిన తుది తీర్పును బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటూ, తమిళనాడు రైతుల జీవనోపాధిని దెబ్బతీసేలా ఉన్న ఈ ప్రకటన ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. అలాగే దిగువ రాష్ట్రాల సమ్మతి లేకుండా, ప్రతిపాదిత ఆనకట్ట నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వవద్దని తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు మాణికం ఠాగూర్, కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 'మేకెదాటు వద్ద కర్ణాటక ఒక్క ఇటుక కూడా వేయకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత కేంద్రానిదే. తమిళనాడు కాంగ్రెస్ తరపున, మేంఈ ప్రాజెక్టును ఎప్పటికీ అనుమతించబోం. మా రాష్ట్ర హక్కులను కాపాడుకోవడానికి ఎంత దూరమైనా వెళ్తాం, పోరాడుతాం' అని ఆయన స్పష్టం చేశారు. అయితే తన పార్టీ సహచరుడి అభ్యంతరాలపై కర్ణాటక సీఎం డీకే శివకుమార్ స్పందించారు. డ్యామ్ నిర్మాణాన్ని ఎవరూ ఆపలేరని పునరుద్ఘాటించారు. మాణిక్యం ఠాగూర్ కు పూర్తి వాస్తవాలు తెలియవని ఆయన పేర్కొన్నారు. 'మేకెదాటు వద్ద ఆనకట్ట నిర్మాణాన్ని ఎవరూ ఆపలేరు. తన రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మాణిక్యం ఠాగూర్‌కు ఉన్నది. కానీ ఆయనకు అసలు వాస్తవాలు తెలియవు. ఆయన తన ప్రతినిధి బృందంతో కర్ణాటకకు వస్తే, నేను స్వయంగా ఆనకట్ట నిర్మాణ ప్రాంతానికి తీసుకెళ్తా. వారి ప్రయోజనాలకు ఇది ఎలా ఉపయోగపడుతుందో చూపిస్తా' అని అన్నారు. మరోవైపు కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలను తమిళనాడులోని అధికార టీవీకే ప్రభుత్వం కూడా తీవ్రంగా విమర్శించింది. ప్రతి ఎన్నికల ముందు కర్ణాటక ముఖ్యమంత్రి ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని న్యాయశాఖ మంత్రి సీటీఆర్ నిర్మల్ కుమార్ ఆరోపించారు. అలాగే తమిళనాడులో ప్రతిపక్ష డీఎంకే కూడా విజయ్ ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచింది. తమిళనాడుకు జీవనాడి వంటి సమస్యగా మారిన కావేరీ అంశంపై, ఇకనైనా మౌనం వీడి తగిన చర్యలు తీసుకోవాలని మాజీ సీఎం ఎంకే స్టాలిన్ ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అంతేకాకుండా, ఈ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

మొదటిపేజీ తరువాయి...

1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో ఆయన నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. ప్రారంభంలో కథానాయకుడిగా కొన్ని సినిమాలు చేసినప్పటికీ, ఆ తర్వాత ప్రతినాయకుడిగా (విలన్), హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారి తనదైన ప్రత్యేక శైలితో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో గిరిబాబు 600కు పైగా చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, మోహన్ బాబు వంటి అగ్ర కథానాయకులందరితోనూ కలిసి నటించిన అనుభవం ఆయన సొంతం. 1977లో వచ్చిన పౌరాణిక చిత్రం 'కురుక్షేత్రం'లో దుశ్శాసనుడి పాత్రలో ఆయన చూపిన నటన ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోయింది. ఆ తర్వాత జ్యోతి, మెరుపు దాడి, పసివాడి ప్రాణం, బాలగోపాలుడు, హలో బ్రదర్, సిసింద్రి, లిటిల్ సోల్జర్స్, నిన్నే పెళ్లాడతా, చంద్రలేఖ, నువ్వే కావాలి వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలను పోషించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త తరం హీరోల చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. మహేశ్ బాబు 'అతడు' చిత్రంలో హీరోయిన్ తండ్రిగా ఆయన చేసిన నటన విశేష ఆదరణ పొందింది. అలాగే గమ్యం, అ ఆ, గీత గోవిందం, డిస్కో రాజా, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, జాతి రత్నాలు వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో చివరి వరకూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. గిరిబాబు కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా పరిశ్రమకు విశేష సేవలందించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో 'రణరంగం' (1985), 'ఇంద్రజిత్' (1990), 'నీ సుఖమే నే కోరుతున్నా' (2008) వంటి సినిమాలు



తెరకెక్కాయి. అలాగే 'మెరుపు దాడి', 'దేవతలారా దీవించండి' వంటి పలు చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. గిరిబాబు మరణం పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. గిరిబాబుకు ముగ్గురు సంతానం కాగా, పెద్ద కుమారుడు రఘుబాబు ప్రముఖ కమెడియన్ గా కొనసాగుతున్నారు. గిరిబాబు అర్ధాంగి శ్రీదేవి 2018లో కన్నుమూశారు.

రాహుల్ గాంధీ నా స్కూటీ ఎక్కడం మర్చిపోలేని అనుభూతి..

మహిళా గిగ్ వర్కర్ ఫుల్ ఖుషి

హైదరాబాద్, : నగరంలో గిగ్ వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ప్రతిపక్ష నేత, సీనియర్ లీడర్ రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. రాహుల్ గాంధీ ఓ అమ్మాయి స్కూటీపై ప్రయాణించారు. హైటెక్స్ ముందున్న ఇందిరాగాంధీ విగ్రహం నుంచి జయభేరి గ్రౌండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో తన స్కూటీపై రాహుల్ గాంధీ ప్రయాణించడం పట్ల గిగ్ వర్కర్ లలిత ఫుల్ ఖుషి అయ్యారు. "నేను ఈరోజు గిగ్ వర్కర్స్ ర్యాలీ ఉందని తెలుసుకుని ఇక్కడకు వచ్చా. నేను స్కూటీపై కూర్చున్న సమయంలో ఒకరు వచ్చి రాహుల్ గాంధీ మీ బైక్ ఎక్కుతారు అని చెప్పారు. రాహుల్ గాంధీని నా స్కూటీ మీద ఎక్కించుకుని డ్రైవ్ చేయడం మర్చిపోలేనిది. ఆయన నాతో చాలా బాగా మాట్లాడారు. అమ్మాయిల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిగ్ వర్కర్ల కోసం చేస్తున్న కార్యక్రమాలు బాగున్నాయి. నేను హాస్టల్‌లో ఉంటూ రాపిడో డ్రైవ్ చేస్తూ అదనపు ఆదాయం



పొందుతున్నా. మాది కర్నూలు జిల్లా.. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాను. మహిళలకు ఇంకా భద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి." అని లలిత తన అనుభవాలను పంచుకున్నారు. ఇక ఈ ర్యాలీ అనంతరం రాహుల్ గాంధీ జయభేరి గ్రౌండ్‌లోని ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం : కలెక్టర్ చంద్రశేఖర్

- గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

- నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా 59వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

రామగిరి, నవంబర్ 14 : పుస్తక పఠనంతోనే విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం 59వ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పండిట్



జవహర్‌లాల్ నెహ్రూ, చదువుల తల్లి సరస్వతి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుస్తకం మనిషికి నిత్య సహచరమని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని తమ లక్ష్యాలను సాధించాలని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా అభివృద్ధి చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను పాఠకులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.10 కోట్లతో నూతన గ్రంథాలయ భవనం: నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నూతన భవనం నిర్మించేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎ. హఫీజ్ ఖాన్ అన్నారు. టౌన్‌హాల్ ప్రాంగణంలో నూతన భవనం నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అబ్దుల్ అలీ అమీర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్ రెడ్డి, ప్రముఖ విద్యావేత్త గోనె రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, 12వ వార్డు కార్పొరేటర్ మామిడి కార్తీక్, జిల్లా గ్రంథాలయ సంస్థ ప్రతినిధులు, ఉద్యోగుల సంఘం నాయకులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



కవిత పార్టీ సీత్తా చాటుతుందా..?

మొదటిపేజీ తరువాయి...

ఏ మాత్రం రాజకీయ నేపథ్యం లేని, చదువుకున్న విద్యార్థి నాయకులకు (కాకతీయ, ఉస్మానియా విశ్వవిద్యాలయాల విద్యార్థులు) టికెట్లు ఇచ్చామని కవిత చెబుతున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు ఈ ఎన్నికల్లో పట్టభద్రులు బుద్ధి చెప్పాలని కవిత పిలుపునిచ్చారు. ఈ పార్టీలు ప్రజలను వేధిస్తున్నాయని.. ప్రజలకు ప్రత్యామ్నాయం ఎవరైనా ఉంటే అది తామేనని ఆమె చెప్పడం గమనార్హం. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది పట్టభద్రులు ఉన్నప్పటికీ ఓటు నమోదు తక్కువగా ఉందని, గ్రాడ్యుయేట్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కవిత కోరారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో టీఆర్ ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ప్రచార వాహనాలను ప్రారంభించిన కవిత, సింగరేణి ప్రాంతంతో పాటు నల్గొండ, ఆదిలాబాద్, మెదక్ తదితర 75 నియోజకవర్గాల పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. రాజకీయ సవాళ్ల బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి సొంత పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కవిత ఎదుర్కొంటున్న మొదటి ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. కొత్త పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ నిర్మించుకోవడం, ప్రధాన పార్టీల ఆర్థిక బలాన్ని తట్టుకోవడం ఆమె ముందున్న ప్రధాన సవాళ్లుగా పరిశీలకులు చెబుతున్నారు. అంతేకాదు.. విద్యావంతులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటారు. సో.. ఈ క్రమంలో కవితకు విద్యావంతుల్లో ఏమేరకు ప్రభావం ఉంది? వారు ఏమేరకు ఆమెను స్వాగతిస్తున్నారన్న విషయం కూడా స్పష్టం అవుతుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి చంద్రబాబు, లోకేష్ కారణం

మొదటిపేజీ తరువాయి...

పేదవాళ్లకు గొప్ప చదువులే లక్ష్యంగా అమ్మ ఒడి నుంచి విద్యాదీవెన, వసతిదీవెన పథకాలతో దేశంలో ఎక్కడాలేని విధంగా వైసీపీ ప్రారంభించి అమలు చేస్తే, మీరు అధికారంలోకి వచ్చిన తొలి క్షణం నుంచే పేదలను ఉన్నత చదువులకు దూరం చేసే కుట్ర పన్నిందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలను నిర్వీర్యం చేసి, బంగారం లాంటి పేద పిల్లల భవిష్యత్తును నాశనం చేసి, వారి చదువుల ఉసురు పోసుకుంటున్నారని ఆరోపించారు. సుమారు రూ.9,600 కోట్లకుపైగా విద్యార్థులకు బాకీ పడ్డారని వివరించారు. విద్యాశాఖను భ్రష్టుపట్టించిన నారా లోకేష్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

తిరుమల వేంకటేశుడికి రూపమిచ్చిన చిత్రకారుడు శ్రీనివాసన్ కన్నుమూత

మొదటిపేజీ తరువాయి...

నేడు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా దాదాపు ప్రతి ఇంట్లో, వ్యాపార సంస్థలో కనిపించే శ్రీవారి చిత్రం శ్రీనివాసన్ గీసిందే. వేంకటేశ్వరస్వామితో పాటు ఆయన పలు ఇతర హిందూ దేవతామూర్తుల చిత్రాలను కూడా గీసి మెప్పించారు. కోవిల్పట్టిలోని మండిత్తోప్పు రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో మరణవార్త తెలియగానే, పలువురు ప్రముఖులు, స్థానికులు ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. శ్రీవారి రూపానికి తన కుంచెతో శాశ్వతత్వాన్ని అందించిన శ్రీనివాసన్ మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ గిగ్ వర్కర్లకు గుడ్‌న్యూస్..

మొదటిపేజీ తరువాయి...



గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు: ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గిగ్ వర్కర్లు కష్టానికి తగిన ఆదాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాహుల్ గాంధీని కలిసిన గిగ్ వర్కర్లు తమకు చట్టపరమైన రక్షణ, గుర్తింపు లేదని సమస్యలు వివరించారని గుర్తుచేశారు. వారికి న్యాయం చేస్తామని అప్పట్లో రాహుల్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన పలువురి అభిప్రాయాలు, సలహాలు తీసుకున్న తర్వాతే ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కాంగ్రెస్ పార్టీ విధానమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

సభకు ముందు శిల్పకళా వేదిక నుంచి జయభేరీ గ్రౌండ్స్ వరకు గిగ్ వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం జయభేరీ గ్రౌండ్స్‌లో రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు, డిమాండ్లను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

సంపాదకీయం

కాంగ్రెస్ కు బిలాంగింగ్ వరమా... శాపమా...!

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' విడుదలైనప్పటి నుండి భారత రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో ఆమె ప్రస్తావించిన పలు కీలక చారిత్రక అంశాలను ఆయుధంగా చేసుకుని భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌పై ఎదురుదాడికి దిగుతోంది.ముఖ్యంగా రాబోయే ఉత్తరప్రదేశ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ పుస్తకంలోని అంశాలు బీజేపీకి రాజకీయంగా కలిసొచ్చే అస్త్రాలుగా మారాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.బీజేపీకి అస్త్రాలుగా మారిన ప్రధాన అంశాలు? ఎమర్జెన్సీ ప్రస్తావన. 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ ఒక పొరపాటు అని, తర్వాత ఇందిర కూడా అదే అభిప్రాయానికి వచ్చారని సోనియా ఈ పుస్తకంలో పేర్కొన్నారు. దీనిపై బీజేపీ స్పందిస్తూ, నెహ్రూ-గాంధీ కుటుంబం చేసిన చారిత్రక తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే ఆమె ప్రయత్నిస్తున్నారని, ఈ పుస్తకానికి 'బిలాంగింగ్' బదులు 'వైట్‌వాషింగ్' అని పేరు పెట్టి ఉండాల్సిందని బీజేపీ అధికార ప్రతినిధి సి.ఆర్. కేశవన్ విమర్శించారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు. ఈ పుస్తకంలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లపై తన కుటుంబానికి క్లీన్ చిట్ ఇచ్చుకునే ప్రయత్నం జరిగిందని బీజేపీ ఆరోపిస్తోంది. పంజాబ్ ఎన్నికల ముంగిట ఈ అంశం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా, బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది. ముందు తన పిల్లలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో ఈ విషయంపై చర్చించినట్లు సోనియా వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తాను ప్రధానమంత్రి పదవి చేపట్టాలా? అని వారిని అడిగినప్పుడు ఇద్దరూ స్పష్టంగా వద్దని చెప్పారని రాశారు. ఇందిరా గాంధీ హత్య, రాజీవ్ గాంధీ హత్యను ప్రత్యక్షంగా చూసిన తమకు, తల్లి కూడా ప్రధానమంత్రి అయితే కుటుంబానికి ముప్పు పెరుగుతుందనే భయం ఉండేదని ఆమె వివరించారు. తాను ప్రధాని కావడం లేదని చెప్పినప్పుడు పిల్లలు ఎంతో ఉపశమనం పొందారని గుర్తుచేసుకున్నారు.2004 ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలా? వద్దా? అనే విషయంలో తాను తీవ్ర మానసిక సంఘర్షణకు గురయ్యానని సోనియా గాంధీ రాశారు. ఒకవైపు కాంగ్రెస్ కార్యకర్తల ఆశలు, ప్రజల నమ్మకం, మరోవైపు తన వ్యక్తిగత భయాలు, కుటుంబ భద్రత వంటి అంశాలు తనను ఆలోచనలో పడేశాయని తెలిపారు. చివరకు ప్రధానమంత్రి పదవిని తిరస్కరించాలని నిర్ణయించుకున్న రాత్రి తన మనసులోని సందేహాలన్నీ తొలగిపోయాయని పేర్కొన్నారు. తన అంతరాత్మ నుంచి 'సోనియా.. నీకు నువ్వు నిజాయితీగా ఉండు. ఈ విషయం నీకు ఎప్పటినుంచో తెలుసు. దాన్ని వదిలేయ్!' అనే భావన కలిగిందని పుస్తకంలో వివరించారు.తన నివాసంలో కాంగ్రెస్, సంకీర్ణ పార్టీల నేతలు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలని కోరిన సమావేశాన్ని కూడా ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ తనను 'మీరు ప్రధానమంత్రి కావడానికి ఎందుకు అంగీకరించారు?' అని ప్రశ్నించారని తెలిపారు. నాయకులు తన మాట వినడం లేదని, ఒత్తిడి చేస్తున్నారని తాను సమాధానమిచ్చినట్లు రాశారు. మరోవైపు ప్రియాంక గాంధీ కూడా తన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని సూచించారని, ఆ సమయంలో ఆమె భావోద్వేగానికి గురయ్యారని వెల్లడించారు.తాను ప్రధానమంత్రి అయితే బీజేపీ, దాని మిత్రపక్షాలు తన విదేశీ మూలాన్ని రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకునే అవకాశం ఉందని సోనియా భావించారు. దీనివల్ల దేశంలో రాజకీయ వివాదం పెరిగి, ప్రభుత్వం పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందారు. తనకు ప్రధానమంత్రి పదవి కంటే దేశంలో స్థిరమైన, సమర్థవంతమైన, లౌకిక ప్రభుత్వం ఏర్పడటమే ముఖ్యమని పేర్కొన్నారు.2004లో పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కాంగ్రెస్ నేతల సమావేశంలో తాను ప్రధానమంత్రి పదవిని చేపట్టబోనని ప్రకటించినప్పుడు పలువురు నాయకులు నిరసన వ్యక్తం చేశారని సోనియా గుర్తుచేసుకున్నారు. కొందరు నిర్ణయం మార్చుకోవాలని కోరడంతో కొద్దిసేపు ప్రసంగాన్ని ఆపాల్సి వచ్చిందని తెలిపారు. అయినప్పటికీ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. అనంతరం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరును ప్రధానమంత్రి పదవికి ప్రతిపాదించారు. దీంతో యూపీఏ ప్రభుత్వానికి మన్మోహన్ సింగ్ నాయకత్వం వహించారు.మొత్తంగా, ప్రధానమంత్రి పదవిని తిరస్కరించడం వెనుక కుటుంబ భద్రత, రాజకీయ పరిస్థితులు, వ్యక్తిగత సిద్ధాంతాలు కీలకంగా ఉన్నాయని సోనియా గాంధీ తన ఆత్మకథలో వివరించారు. 2004లో దేశ రాజకీయాలను మలుపు తిప్పిన తన నిర్ణయంపై ఇన్నేళ్ల తర్వాత ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.2004 ప్రధాని పదవి త్యాగం మరియు 'సూపర్ పీఎం'. 2004లో తాను ప్రధాని పదవిని ఎందుకు వదులుకున్నానో సోనియా ఈ పుస్తకంలో వివరించారు. అయితే, 1999లో వాజ్‌పేయి ప్రభుత్వం పడిపోయినప్పుడు సంఖ్యాబలం లేకపోయినా ఆమె ప్రధాని కావాలని ఆశపడ్డారని బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది విమర్శించారు. 2004లో ప్రధాని పదవిని వదులుకున్నట్లు నటిస్తూ, నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా ఉంటూ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంపై పెత్తనం చెలాయించి 'సూపర్ పీఎం' గా వ్యవహరించారని బీజేపీ దుయ్యబట్టింది. భారత పౌరసత్వం వివాదం. 1968లో రాజీవ్ గాంధీని వివాహం చేసుకుని భారత్‌కు వచ్చిన సోనియా, 1983 వరకు అంటే 15 ఏళ్ల పాటు ఇటలీ పాస్‌పోర్టునే ఎందుకు కొనసాగించారన్న పాత వివాదాలను బీజేపీ నేతలు మళ్లీ తెరపైకి తెచ్చారు. రాజీవ్ గాంధీ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించే సమయానికే ఆమె భారత పౌరసత్వం తీసుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని బీజేపీ ప్రశ్నిస్తోంది. బాబ్రీ మసీదు కూల్చివేత. 1992 నాటి బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనపై సోనియా చేసిన వ్యాఖ్యలను కూడా బీజేపీ తప్పుబట్టింది. దశాబ్దాల పాటు భారత రాజకీయాల చక్రం తిప్పిన 10 జన్ పథ్ తెరవెనుక అధికార ప్రస్థానాన్ని, 1998లో కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తీరును, యూపీఏ-1, యూపీఏ-2 సంకీర్ణ ప్రభుత్వాల నిర్వహణలోని అంతర్గత ఒత్తిళ్లను సోనియా ఈ పుస్తకంలో స్పృశించారు. నాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో తన అనుబంధం, 2004లో ప్రధాని పదవిని త్యాగం చేయడం వెనుక ఉన్న అంతరంగిక నిర్ణయాలు, కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల అంతర్గత కుమ్ములాటల గుట్టును బయటపెట్టడం జాతీయ స్థాయిలో తీవ్ర రాజకీయ దుమారానికి కారణమైంది.ప్రతిపక్ష అధికార ఎన్‌డీయే కూటమి నాయకులు ఈ ఆత్మకథపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. యూపీఏ హయాంలో జరిగిన పలు ఆర్థిక కుంభకోణాలు, సూపర్ ప్రైమ్ మినిస్టర్ గా నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ ద్వారా సమాంతర అధికారాన్ని చెలాయించారన్న ఆరోపణలను కప్పిపుచ్చుకోవడానికే సోనియా ఈ పుస్తకం ద్వారా సింపథీ కార్డ్ ని ప్రయోగిస్తున్నారని అధికార వర్గాలు విమర్శిస్తున్నాయి. 2004-2014 మధ్యకాలంలో జరిగిన తెరవెనుక రాజకీయాలను తనకు అనుకూలమైన రీతిలో మలచుకున్నారనే అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కాంగ్రెస్ శ్రేణులు , ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు మాత్రం సోనియా రాసిన పుస్తకాన్ని సమర్థిస్తున్నాయి. దేశం కోసం భర్తను, అత్తను కోల్పోయినా.. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణకు, పార్టీ ఉనికికి ఆమె చేసిన త్యాగాలను బిలాంగింగ్ పుస్తకం ప్రపంచానికి చాటిచెబుతోందని అభివర్ణిస్తున్నారు. ఒక విదేశీ మూలాలున్న మహిళగా ఎదుర్కొన్న ఆక్షేపణలను అధిగమించి, భారతీయతను తన సొంతం చేసుకున్న తీరును ఈ పుస్తకం ప్రతిబింబిస్తుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.ఈ పుస్తక ప్రభావం కేవలం గత చరిత్రకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సాగించే నెరేటివ్ యుద్ధానికి ప్రధాన ఇంధనంగా మారనుంది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల రాజకీయ ప్రస్థానానికి గాంధీ కుటుంబ త్యాగాల నేపథ్యాన్ని మరోసారి ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడానికి ఇది ఒక మాధ్యమంగా ఉపయోగపడనుంది. అదే సమయంలో, బీజేపీ దీనిని ఎదుర్కొనేందుకు యూపీఏ కాలం నాటి పాలనా వైఫల్యాలను, ప్యాకేజ్ రాజకీయాలను తిరిగి ఎండగట్టే అవకాశం ఉంది. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనేది కేవలం సోనియా గాంధీ జ్ఞాపకాల సమాహారం మాత్రమే కాదు. అది ఆధునిక భారత రాజకీయ చరిత్రలోని అత్యంత కీలకమైన ఘట్టాలకు అద్దం పట్టే ఒక వివాదాస్పద పత్రం. ప్రేమ, కోల్పోవడం, సాధికారత, అధికార పోరాటాల మధ్య సాగిన ఒక మహిళ జీవిత ప్రయాణం ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్-బీజేపీల మధ్య సరికొత్త పొలిటికల్ డిబేట్‌ను రాజేసింది.యూపీ ఎన్నికల ముందు ఈ అంశాన్ని లేవనెత్తడం ద్వారా హిందూ ఓటర్లను ఆకట్టుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది.మొత్తంగా, వ్యక్తిగత జ్ఞాపకాలు మరియు రాజకీయ ప్రస్థానాన్ని వివరిస్తూ సోనియా గాంధీ రాసిన ఈ పుస్తకం, కాంగ్రెస్ పార్టీకి రక్షణ కవచంగా మారడానికి బదులు, పాత వివాదాలను మళ్లీ తవ్వితీసి బీజేపీకి రాజకీయంగా బలమైన అస్త్రాలను అందించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్టీసీ సీజన్ పాస్‌పై సండే ఫ్రీ..



9 అదనపు సౌకర్యాలు, ప్రత్యేక రాయితీలు

హైదరాబాద్, : మంత్లీ సీజన్ టికెట్స్ తీసుకునే ప్రయాణికులకు రాయితీలు కల్పిస్తూ తెలంగాణ ఆర్టీసీ నిర్ణయం తీసుకున్నది. మంత్లీ సీజన్ పాస్ తీసుకునేవారికి బస్ పాస్ దూర పరిమితి ఎత్తివేయడంతో పాటు.. రూ.20తోనే అప్‌గ్రేడ్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతోపాటు నిర్దేశించిన ప్రాంతాల్లో ఆదివారం ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. సంస్థ తమ నెలవారీ సీజన్ టికెట్ (ఎంఎస్‌టీ) పథకం కింద 9 అదనపు సౌకర్యాలు, ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. ఈ సవరించిన నిబంధనలు నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు, నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఈ నిర్ణయం ఆర్థికంగా ఎంతో ఊరటనివ్వన్నట్టు ఆర్టీసీ తెలిపింది. ఈ నూతన నిర్ణయాల ప్రకారం.. నెలవారీ సీజన్ టికెట్ల జారీకి ఇప్పటివరకు ఉన్న దూర పరిమితిని ఆర్టీసీ పూర్తిగా తొలగించింది. నిర్దేశించిన రూట్, చార్జీల నిబంధనలకు లోబడి, ప్రయాణికులు ఇకపై ఎలాంటి దూర పరిమితి లేకుండా నెలవారీ సీజన్ టికెట్లను పొందవచ్చు. సాధారణ ప్రయాణికులకు మెరుగైన ప్రయాణాన్ని అందించేందుకు డీలక్స్ నెలవారీ సీజన్ టికెట్లను కూడా ఆర్టీసీ ప్రవేశపెడుతున్నది. అవి ఈ-డీలక్స్ సర్వీసుల్లో కూడా చెల్లుబాటు అవుతాయి. ఇక నెలవారీ సీజన్ టికెట్ హోల్డర్లకు ప్రత్యేక ప్రయోజనంగా హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్లగొండ, కరీంనగర్‌లో నడిచే అన్ని క్యాటగిరీల సిటీ బస్సు సర్వీసుల్లో ఆదివారాల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును కల్పించారు. అయితే, ఈ సౌకర్యం గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని పుష్పక్ ఎయిర్ పోర్ట్ లైనర్ సర్వీసులకు, ఇతర ప్రభుత్వ సెలవు దినాలకు వర్తించవని స్పష్టంచేశారు. అదేవిధంగా ప్రయాణ సౌలభ్యం కోసం కాంబీ టికెట్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చారు. దీనికింద ప్రతి ప్రయాణానికీ అదనంగా రూ.20 చెల్లించి కాంబీ టికెట్ తీసుకోవడం ద్వారా పల్లెవెలుగు మంత్లీ సీజన్ టికెట్ హోల్డర్స్ ఎక్స్‌ప్రెస్, ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ, అలాగే ఎక్స్‌ప్రెస్ ఎంఎస్‌టీ హోల్డర్లు డీలక్స్, ఈ-డీలక్స్ బస్సులలోనూ ప్రయాణించవచ్చు. అయితే పల్లెవెలుగు పాస్‌దారులకు డీలక్స్ లేదా ఈ-డీలక్స్ బస్సుల్లో అనుమతి ఉండదు.

హైదరాబాద్ ఐటీ ఉద్యోగులకు గుడ్ న్యూస్..

ఐటీ కారిడార్‌లో వన్ వే లూప్ విధానం

- ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీకి పరిష్కార చర్యలు
- వన్ వే లూప్ విధానం అమలుకు పోలీసుల కసరత్తు
- ఐకియా, బయోడైవర్సిటీ జంక్షన్ల మధ్య కీలక మార్పులు
- ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ప్రణాళికలు
- డీజీపీకి మూడు ప్రతిపాదనలు వివరించిన అధికారులు



హైదరాబాద్ : హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో రోజురోజుకు తీవ్రమవుతున్న ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సరికొత్త ప్రణాళికతో ముందుకొస్తున్నారు. ఐకియా, మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ వంటి అత్యంత రద్దీ జంక్షన్లను కలుపుతూ 'వన్ వే లూప్' విధానాన్ని అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నారు. ఇది అమలైతే వాహనాలు సిగ్నళ్ల వద్ద ఆగకుండా నిరంతరాయంగా ఒకే మార్గంలో ప్రయాణించే వీలు కలుగుతుంది. ఐటీ కారిడార్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటోంది. ముఖ్యంగా ఆఫీసుల నుంచి ఉద్యోగులు ఒకేసారి బయటకు రావడంతో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు పోలీసులు వన్ వే లూప్ విధానంపై దృష్టి సారించారు. దీని ద్వారా ఐకియా నుంచి బయోడైవర్సిటీ జంక్షన్‌కు, అక్కడి నుంచి టీ-వర్క్స్, మైహోం భుజా మీదుగా తిరిగి ఐకియా వైపు వాహనాలు ఒకే వలయాకార మార్గంలో ప్రయాణిస్తాయి. ఇప్పటికే కేబీఆర్ పార్కు చుట్టూ ఈ విధానం విజయవంతం కావడంతో, అదే తరహాలో ఇక్కడ కూడా అమలు చేయాలని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనలపై సైబరాబాద్ సీపీ ఎం. రమేశ్, జాయింట్ సీపీ సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు డీజీపీ సీవీ ఆనంద్ కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ట్రాఫిక్ పోలీసులు సిద్ధం చేసిన మూడు రకాల ప్రతిపాదనలను డీజీపీకి వివరించారు. జీహెచ్ఎంసీ, టీఎస్ఐఐసీ అధికారులతో చర్చించిన అనంతరం, సాధ్యాసాధ్యాలను బట్టి ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేయనున్నారు.

స్వీపర్లుగా నియమితులై..

కోట్లకు పడగలెత్తి..

యూపీలో బయటపడిన భారీ కుంభకోణం



లక్నో: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో పారిశుద్ధ్య కార్మికులుగా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరు ఏకంగా కోటీశ్వరులుగా మారిపోయారు. నెలకు రూ.42 వేల జీతం తీసుకుంటున్న వీరిలో కొందరికి కల్యాణ మండపాలు, సిమెంట్ ఏజెన్సీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మరికొందరికి పెట్రోల్ బంకులు సైతం ఉన్నాయి. అయితే వీరు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేయడం లేదు. రోజుకు రూ. 300 నుంచి 500 కూలీ ఇచ్చి ఇతరులతో పనిచేయిస్తున్నారు.
ఈ వ్యవహారం 'దైనిక్ భాస్కర్' నిర్వహించిన పరిశోధనలో వెలుగు చూసింది. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ జిల్లాలో ఈ భారీ అక్రమ వ్యవస్థ బయటపడింది. రాష్ట్రంలో సుమారు 94 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో కొందరు గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శులతో కుమ్మక్కై విధులకు హాజరుకాకుండానే జీతాలు పొందుతున్నట్లు తేలింది. 2008 తర్వాత ఉద్యోగాల్లో చేరిన కొందరు అఖిలేశ్ యాదవ్ ప్రభుత్వ హయాంలో పర్మినెంట్ అయిన తర్వాత వ్యాపారాలు ప్రారంభించారు.

బ్రహ్మోత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం..

ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ కమిటీ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 14: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 19 నుంచి 24 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శనివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూలాన్ని మరిచిపోయారు..


మూసీ సుందరీకరణపై సబితాఇంద్రారెడ్డి ఫైర్

హైదరాబాద్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఇతర బీఆర్ ఎస్ నాయకులతో కలిసి వికారాబాద్ పరిధిలోని మూసీ ప్రభావిత ప్రాంతంలో పర్యటించారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా గొప్పగా చెబుతున్నరు.. మూసీని సుందరీకరణ చేస్తానని, మూసీలోకి మురికినీళ్లు రాకుండా చేస్తానని గత రెండు సంవత్సరాల నుంచి వింటూనే ఉన్నామని అన్నారు. . 50 వేల కోట్ల రూపాయలు పెట్టి మూసీని బాగు చేస్తాననే మాట మాట్లాడుతున్నడు.. మూసీ అనే ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఖచ్చితంగా వికారాబాద్‌ను గుర్తు చేసుకుంటం. వికారాబాద్‌లో పుట్టిన మూసీ కలుషితమైపోయి కిందంతా మురికినీళ్లు పారుతున్నయని మాట్లాడుతున్న సందర్భంలో వికారాబాద్‌లో ఉన్న ఫ్లూ రిపేర్ చేయాల్సిన బాధ్యత ఉందని.. అధికారులు కానీ, స్థానికంగా ఉన్నవాళ్లు కానీ, ముఖ్యమంత్రి ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఎందుకు ఆలోచించడం లేదని సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మూసీ నీళ్లు ఎక్కడికిపోతున్నయి చూస్తే.. మొత్తం నీళ్లు గండిపేటకు పోయి చేరుతున్నయి.. ముఖ్యమంత్రే చాలా గొప్పగా చేస్తమని పెద్ద పెద్ద మాటలు చెబుతున్నరు.. వికారాబాద్ మూలంగా శుభ్రంగా ఉన్న మూసీని మురికికూపం చేయడానికి ఇక్కడి నుంచే మొదలుపెడుతున్నరని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. పక్కనున్న రైతన్నలందరినీ అడుగుతున్నారు.
రైతులు బోర్లు వేస్తే మురికి నీళ్లు వచ్చి.. అవే మురికినీళ్లతో పంటలు పండించడం.. మూసీ ద్వారా పోతున్న పక్కనున్న పొలాలన్నీ కూడా ఇవే నీళ్లు వాడుకుని కూరగాయలు, ఇతర పంటలు పండిస్తున్నరు..



ఆ కూరగాయలు పండినా... మురికినీళ్లతో పండించిన పంటలతో ఆరోగ్య సమస్యలు కూడా వస్తయన్నారు. మూసీని బాగు చేస్తానన్న ముఖ్యమంత్రి మూలాన్ని మరిచిపోయారని గుర్తుచేసేందుకు ఇక్కడికి రావడం జరిగిందన్నారు.

కరోనా కొత్త వేరియెంట్



కరోనా వైరస్ మరో కొత్త రూపంలో ప్రపంచంలోని పలు దేశాల్లో వ్యాపిస్తోంది. పీజే.2.1గా పిలుస్తున్న ఈ కొత్త వేరియంట్‌ను ఈ ఏడాది మే నెలలో కెనడాలో తొలిసారిగా గుర్తించారు. ఆ తర్వాత అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తోపాటు ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లోనూ దీని ఉనికిని గుర్తించారు. ఈ వేరియంట్ వల్ల మరోసారి కరోనా కేసులు పెరిగే అవకాశం ఉందా? ఇప్పటికే తీసుకున్న టీకాలు, శరీరంలోని రోగనిరోధక శక్తి దీనిపై ఎంతవరకు పనిచేస్తాయి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ప్రస్తుత పరిశోధనల ప్రకారం ఈ వేరియంట్ గతంలో వ్యాప్తి చెందిన రకాల కంటే తీవ్రమైన అనారోగ్యాన్ని కలిగిస్తుందని చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. దీని స్పైక్ ప్రొటీన్‌లో అనేక జన్యు మార్పులు ఉన్నప్పటికీ, టీకాల ద్వారా ఏర్పడిన రోగనిరోధక శక్తిని తప్పించుకునే సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు పరిశోధకులు గుర్తించలేదు.
ఏంటీ పీజే.2.1 కోవిడ్ వేరియెంట్..?: పీజే.2.1 అనేది కోవిడ్‌కు కారణమయ్యే సార్స్-కోవ్-2 వైరస్‌కు చెందిన ఒక ఉపరకం.

పీజే.2.1 వేగంగా వ్యాప్తి.. ప్రమాదకరమైనదా..?

సాధారణంగా వైరస్‌లో మార్పులు క్రమంగా చోటుచేసుకుంటాయి. కానీ ఈ వేరియంట్‌లో ఒకేసారి అనేక జన్యు మార్పులు కనిపించడంతో పరిశోధకులు దీన్ని ప్రత్యేక రకంగా పేర్కొంటున్నారు. ఈ ఏడాది మే 2న కెనడాలోని అంటారియోలో దీన్ని తొలిసారిగా గుర్తించారు. ఆ తర్వాత కెనడాలోని ఇతర ప్రాంతాలు, అమెరికాలోని పలు రాష్ట్రాల్లోనూ కేసులు నమోదయ్యాయి. సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇజ్రాయెల్, ఫ్రాన్స్, స్పెయిన్ వంటి దేశాల్లో కూడా దీని ఉనికిని గుర్తించారు. అంటారియోలో సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 17 వరకు సేకరించిన కరోనా నమూనాల్లో 25.2 శాతం ఈ వేరియంట్‌కు చెందినవే. అంతకుముందు నాలుగు వారాల్లో ఈ సంఖ్య 16.9 శాతంగా ఉంది. పరిశోధనల ప్రకారం, ఈ వైరస్ మానవ కణాల ఉపరితలంపై ఉండే ఏసీఈ2 గ్రాహకంతో మరింత సమర్థవంతంగా అనుసంధానమవుతోంది. ఈ లక్షణం వైరస్ కణాల్లోకి ప్రవేశించడానికి సహాయపడుతుంది. అయితే టీకా తీసుకున్నవారిలో ఏర్పడిన ప్రతిరక్షకాలను తప్పించుకునే సామర్థ్యం ఇతర వేరియంట్లతో పోలిస్తే గణనీయంగా ఎక్కువగా లేదని ప్రయోగశాల పరీక్షల్లో తేలింది. ఎల్‌పీ.8.1కు అనుగుణంగా రూపొందించిన టీకా తీసుకున్నవారిలో ఏర్పడిన ప్రతిరక్షకాలు కూడా ఈ వేరియంట్‌ను నిరోధించగలిగాయి.
లక్షణాలు ఎలా ఉంటాయి..?: ఈ వేరియంట్‌కు ప్రత్యేకమైన లక్షణాలను ఇప్పటివరకు గుర్తించలేదు. జ్వరం, చలి, దగ్గు, గొంతునొప్పి, ముక్కు కారడం లేదా మూసుకుపోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, అలసట వంటి సాధారణ కోవిడ్ లక్షణాలే కనిపిస్తాయి. కొందరిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, జీర్ణ సంబంధిత సమస్యలు, వాసన లేదా రుచి తెలుసుకునే సామర్థ్యంలో మార్పులు కూడా ఉంటాయి. ఈ లక్షణాలు సాధారణ జలుబు, కాలానుగుణంగా వచ్చే ఫ్లూ వ్యాధి లక్షణాలతో పోలి ఉంటాయి. అందువల్ల లక్షణాలను బట్టి మాత్రమే ఏ వ్యాధి సోకిందో నిర్ధారించడం సాధ్యం కాదు. అవసరమైనప్పుడు పరీక్షలు చేయించుకోవాలి. వైరస్ ఏ రకానికి చెందిందో తెలుసుకోవడానికి జన్యు క్రమ విశ్లేషణ చేస్తారు. పీజే.2.1 వల్ల ఆసుపత్రుల్లో చేరికలు, మరణాలు పెరుగుతాయని ఇప్పటివరకు ఆధారాలు లేవు. వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, మధుమేహం, గుండె జబ్బులు, దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు మాత్రం కోవిడ్ తీవ్రతకు గురయ్యే ప్రమాదంలో ఉంటారు.
ఆందోళన చెందాలా..?: ఈ కొత్త వేరియంట్ వ్యాప్తిని గమనించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రజలు భయపడాల్సిన పరిస్థితి లేదని పరిశోధకులు సూచిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గత జూలైలో విడుదల చేసిన చివరి జాబితాలో పీజే.2.1ను ప్రత్యేకంగా పర్యవేక్షించాల్సిన లేదా ఆసక్తికరమైన వేరియంట్లలో చేర్చలేదు. కోవిడ్ టీకాలు తీవ్రమైన అనారోగ్యం, ఆసుపత్రిలో చేరడం, మరణాల ప్రమాదాన్ని తగ్గించడంలో ఇప్పటికీ ముఖ్యమైనవే. అయితే ఈ కొత్త వేరియంట్‌పై టీకాల ప్రభావం నిజ జీవిత పరిస్థితుల్లో ఎంతవరకు ఉంటుందో మరిన్ని పరిశోధనలు అవసరం. భారత్‌లోనూ కరోనా వైరస్ జన్యు మార్పులను గుర్తించేందుకు భారత సార్స్-కోవ్-2 జన్యు పరిశోధన సమాఖ్య నిఘా కొనసాగిస్తోంది. అయితే పీజే.2.1 ను భారత్‌లో గుర్తించారా లేదా అనే విషయంపై ప్రస్తుతం స్పష్టమైన సమాచారం లేదు. వైరస్ కొత్త రూపాలు పుట్టుకొస్తున్న నేపథ్యంలో జన్యు పర్యవేక్షణ, అవసరమైన పరీక్షలు, ప్రమాదంలో ఉన్నవారికి టీకాలు వేయించడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

క్యూబాలో ఆకలి కేకలు



ద్వీప దేశం ఆర్థికవ్యవస్థపై అమెరికా ఇంధన ఆంక్షల ప్రభావం


హవానా: కరీబియన్ సముద్రంలోని ద్వీప సమూహ దేశం క్యూబాలో అధికారంలో ఉన్న సామ్యవాద వ్యవస్థ గత కొన్ని దశాబ్దాలుగా దేశ ప్రజలకు ఉచిత విద్య, ఆరోగ్య సంరక్షణ, రాయితీతో కూడిన ఆహారం, అత్యధికులకు ప్రభుత్వరంగ ఉపాధి అందిస్తూ వచ్చింది. బియ్యం, బీన్స్, పాలపొడి, చికెన్, వంటనూనె, గుడ్ల వంటి ఆహార దిగుమతులపై గతంలో ఏటా 2 బిలియన్ డాలర్లకు (రూ.18,855 కోట్లు) పైగా ఖర్చు చేసేది. దాదాపుగా 99 శాతం అక్షరాస్యత ఉన్న ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఓ మోస్తరుగా ఉన్నా, కనీస అవసరాలకు ఇబ్బంది పడేవారు కాదు. ఇప్పుడు అదంతా గత చరిత్ర. సుమారు కోటీ 10 లక్షల జనాభా గల నేటి క్యూబాను సుదీర్ఘకాలంగా ఆర్థికసంక్షోభం పీడిస్తోంది. అమెరికా ఇంధన ఆంక్షలు, పెరిగిన ద్రవ్యోల్బణం, తరుగుతున్న ప్రభుత్వ వనరులు క్యూబన్ల జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. ముఖ్యంగా అమెరికా ఇంధన ఆంక్షలు ఈ ద్వీప జనజీవనాన్ని దారుణంగా దెబ్బతీశాయి. ఒకప్పుడు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న పర్యాటకరంగం తీవ్రంగా క్షీణించింది. రాజధాని నగరం హవానాలో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఆహార పంపిణీ కేంద్రం వద్ద వందలాదిగా జనం బారులు తీరుతున్నారు. ఉదయాన్నే ఏడింటికి తలుపులు తెరిచే ఈ కేంద్రంలో పంపిణీ చేసే ఆహారం కోసం కొంతమంది ప్లాస్టిక్ బొచ్చెలతో రాత్రే అక్కడికి చేరుకొని రోడ్డు మీద పడుకొంటున్నారు. “మేము చాలా గడ్డు రోజులు గడుపుతున్నాం” అని ఈ కేంద్రానికి వచ్చిన రిటైర్డ్ సెక్యూరిటీ గార్డు ఫెర్నాండో ఫెర్నాండెజ్ (71) తెలిపారు. “వీరు పంపిణీ చేసే ఆహారంతో నా బిడ్డలకు కనీసం ఒక్కపూటైనా కడుపు నిండుతుంది” అని అయిదుగురు పిల్లల తల్లి మర్లీస్ పాన్స్ (34) చెప్పారు. క్యూబాలో అక్కడక్కడా స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న ఇటువంటి సామాజిక వంటశాలలే అభద్రతా భావంతో ఉన్న స్థానికులకు జీవనాధారంగా మారాయి. పలు ధార్మిక సంఘాలు, అంతర్జాతీయ సంస్థలు, ఐక్యరాజ్య సమితి ఈ కేంద్రాల ద్వారా ప్రజల ఆకలిని తీరుస్తున్నాయి. ఈ కిచెన్లలో పెద్ద సైజు కడాయిలు పెట్టి అన్నం, గుడ్లు, పాస్తా.. అప్పుడప్పుడు కొద్దిపాటిగా చికెన్ వండుతున్నారు. బాటిళ్లలో చాక్లెట్ పాలను నింపుతున్నారు.

కరువు మండలాల్లో రుణాల వసూళ్లకు బ్రేక్

హైదరాబాద్, : తెలంగాణలో కరువు పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు భారీ ఊరట లభించనుంది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మండలాల్లో రైతులు తీసుకున్న పాత రుణాల వసూళ్లను 12 నెలల పాటు నిలిపివేయాలని నిర్ణయించింది. అంతేకాదు.. రుణాలు తిరిగి చెల్లించేందుకు రైతులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు గడువు కల్పించనుంది. దీంతో అప్పుల చెల్లింపుల విషయంలో రైతులకు కొంత ఉపశమనం లభించనుంది.రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనకు బ్యాంకర్లు కూడా సూత్రప్రాయంగా అంగీకరించారు. మంగళవారం ప్రజాభవన్లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్బీసీ) ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బ్యాంకర్లతో మాట్లాడారు. కరువు కారణంగా పంటలు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న రైతుల నుంచి ప్రస్తుతం ఉన్న రుణాలను వెంటనే వసూలు చేయకుండా మారటోరియం అమలు చేయాలని కోరారు. అలాగే రానున్న రబీ సీజన్లో సాగు పనుల కోసం రైతులకు కొత్త రుణాలు కూడా ఇవ్వాలని సూచించారు.బ్యాంకర్ల సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం.. ఓ మోస్తరు కరువు ఉన్న 254 మండలాల్లో రైతుల రుణాల వసూళ్లను 12 నెలల పాటు నిలిపివేస్తారు. ఈ రుణాలను తిరిగి చెల్లించేందుకు రైతులకు 36 నెలల గడువు కల్పిస్తారు. అంటే మూడేళ్లలోపు రుణాలను చెల్లించాల్సి ఉంటుంది. అదే తీవ్ర కరువు పరిస్థితులు ఉన్న 111 మండలాల్లోనూ 12 నెలల పాటు రుణాల వసూళ్లు నిలిపివేస్తారు. అయితే ఈ మండలాల రైతులకు రుణాల చెల్లింపునకు 60 నెలల గడువు ఇవ్వనున్నారు. అంటే ఐదేళ్లలోపు రుణాలు తిరిగి చెల్లించే అవకాశం ఉంటుంది.మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మారటోరియం కోసం రైతులు ప్రత్యేకంగా ముందుకొచ్చినా, రాకపోయినా బ్యాంకులే అర్హులైన రైతులను గుర్తించి ఉపశమన చర్యలు చేపట్టనున్నాయి. రైతుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి అర్హులకు మారటోరియం అమలు చేయడంతో పాటు రబీ సీజన్కు కొత్త రుణాలు కూడా మంజూరు చేయనున్నారు.ఫామ్లు అన్వేషించండిమారటోరియం అమలయ్యే 12 నెలల కాలానికి రైతుల రుణాలపై పడే వడ్డీ భారాన్ని తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం ఆ వడ్డీని రాయితీ రూపంలో సర్దుబాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరనుంది. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల వివరాలను 15 రోజుల్లోగా రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) సీఐఎంఎస్ పోర్టల్లో అప్లోడ్ చేయాలని రాష్ట్ర బ్యాంకర్ల సమావేశం నిర్ణయించింది.

తల్లిని కత్తితో పొడిచిన బాలుడు..

ఆ తర్వాత బిల్డింగ్ పైనుంచి కిందకు దూకి ఆత్మహత్య



గువాహటి: ఒక బాలుడు కత్తితో తల్లిపై దాడి చేసి ఆమెను తీవ్రంగా పొడిచాడు. ఆ తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఒక ప్రాంతంలోని బిల్డింగ్ పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ రెండు సంఘటనలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అస్సాం రాజధాని గువాహటిలో ఇది జరిగింది. తూర్పు జ్యోతినగర్లోని హల్ధీ మిల్ ప్రాంతంలో నివసించే బాలుడు 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తల్లి చంద్రాని కలితపై కత్తితో అతడు దాడి చేశాడు. ఆమెను తీవ్రంగా పొడిచాడు. ఆ తర్వాత ఇంటి నుంచి నుంచి బయటకు వెళ్లాడు.

కాగా, తల్లిపై కత్తితో దాడి చేసిన తర్వాత గువాహటిలోని ఏబీసీ ప్రాంతంలో ఉన్న ఒక భవనం వద్దకు ఆ బాలుడు చేరుకున్నాడు. ఆ బిల్డింగ్ పైనుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన ఆ బాలుడ్ని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

మరోవైపు బాలుడి కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన తల్లి చంద్రాని కలితను పొరుగువారు గౌహతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్కు తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్నది. ఆ మహిళ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. అయితే ఈ రెండు సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ బాలుడు తన తల్లిపై కత్తితో ఎందుకు దాడి చేశాడు? ఆ తర్వాత బిల్డింగ్ పైనుంచి దూకి ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు? అన్నది దర్యాప్తు చేస్తున్నారు.

50 రకాల క్యాన్సర్లను ముందుగానే గుర్తించే కొత్త రకమైన పరీక్ష..

క్యాన్సర్ను ఎలా గుర్తిస్తుంది..?

క్యాన్సర్ను ముందుగానే గుర్తించేందుకు ఒకే రక్త నమూనాతో 50కి పైగా రకాల క్యాన్సర్లను గుర్తించగలుగుతామని చెబుతున్న గల్లెరి పరీక్షపై ఆసక్తి పెరుగుతోంది. ఈ పరీక్షను అభివృద్ధి చేసిన సంస్థ వాదనల ప్రకారం.. లక్షణాలు కనిపించకముందే క్యాన్సర్కు సంబంధించినసంకేతాలను గుర్తించవచ్చు. అయితే పరిశోధనల్లో ఈ పరీక్షకు కొన్ని పరిమితులు ఉన్నట్లు వెల్లడైంది. ముఖ్యంగా ప్రారంభ దశ క్యాన్సర్లను గుర్తించడంలో ఇది అంత సమర్థవంతంగా లేదని, క్యాన్సర్ మరణాల ప్రమాదాన్ని తగ్గిస్తుందని ఇప్పటివరకు నిరూపితం కాలేదని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ సలహా మండలి గత సెప్టెంబర్ 23న ఈ పరీక్షకు అనుమతి ఇవ్వాలని సిఫారసు చేసింది. అయితే ఇది తుది అనుమతి కాదు. పరీక్షకు సంబంధించిన వివరాల్లో ప్రారంభ దశ క్యాన్సర్ గుర్తింపు అనే పదాన్ని తొలగించాలని కూడా మండలి సభ్యులు సూచించారు.

గల్లెరి పరీక్ష అంటే ఏమిటి..?: గల్లెరి పరీక్ష రక్తంలోని క్యాన్సర్ కణాల నుంచి విడుదలయ్యే డీఎన్ఏ ముక్కలను పరిశీలిస్తుంది. వాటిపై ఉండే ప్రత్యేకమైన మిథైలేషన్ గుర్తులను గుర్తించి, యంత్ర అభ్యాస పద్ధతుల ద్వారా క్యాన్సర్ సంకేతాలు ఉన్నాయా లేదా అని ఫలితం ఇస్తుంది. 50కి పైగా క్యాన్సర్లను గుర్తించే అవకాశం, క్యాన్సర్ ఏ అవయవం నుంచి మొదలై ఉంటుందో అంచనా వేయగలగడం దీని ప్రత్యేకతలు. ఒక అధ్యయనంలో పరీక్ష చేయించుకున్న 32 వేల మందిలో 173 మందికి క్యాన్సర్ నిర్ధారణ కాగా, వారిలో 91 శాతం మందికి క్యాన్సర్ రకాన్ని ఈ పరీక్ష సరిగ్గా అంచనా వేసింది. తప్పుడుపాజిటివ్ ఫలితాలు కూడా సుమారు 0.5 శాతమేనని పరిశోధకులు తెలిపారు. అయితే మూడు సంవత్సరాల పాటు పరీక్షించినప్పుడు అన్నిదశల్లోని క్యాన్సర్లను గుర్తించే సామర్థ్యం31 శాతం కంటే తక్కువగా ఉంది. అంటే దాదాపు 69 శాతం కేసులను గుర్తించలేకపోయింది. ప్రారంభ దశ క్యాన్సర్లను గుర్తించే సామర్థ్యం కేవలం 21 శాతమే. అంటే దాదాపు 80 శాతం కేసులు తప్పిపోయాయి.

సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు..: ఈ పరీక్ష వల్ల క్యాన్సర్ను ముందుగానే గుర్తించి మరణాల ప్రమాదాన్ని తగ్గించవచ్చని ఆశించినప్పటికీ, ఇప్పటివరకు అలాంటి ప్రయోజనం నిరూపితం కాలేదు. మూడు సంవత్సరాల్లో ముదిరిన దశ క్యాన్సర్ల సంఖ్యను తగ్గించాలన్న పరిశోధన లక్ష్యాన్ని కూడా ఈ పరీక్ష చేరుకోలేకపోయింది. అమెరికా సలహా మండలి పరీక్ష సురక్షితమని ఏకగ్రీవంగా సిఫారసు చేసినప్పటికీ, దాని ప్రభావంపై మాత్రం సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పాజిటివ్ ఫలితం వస్తే మరిన్ని పరీక్షలు, కొన్నిసార్లు బయాప్సీ చేయాల్సి వస్తుంది. ఒక అధ్యయనంలో 0.6 శాతం మందికి ఇన్వేసివ్ పరీక్షలు అవసరమయ్యాయి. పరీక్ష వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాలపై ఇంకా స్పష్టత అవసరమని నిపుణులు అభిప్రాయపడ్డారు.



వైద్యులతో చర్చించాలి..: ఈ పరీక్ష చేయించుకోవాలా వద్దా అనే విషయాన్ని వైద్యుడితో చర్చించిన తర్వాతే నిర్ణయించుకోవాలి. అమెరికాలో ప్రస్తుతం దీని ధర 949 డాలర్లు కాగా, ప్రభుత్వ ఆరోగ్య బీమా లేదా ఇతర బీమా సంస్థలు ఖర్చును భరిస్తాయనే హామీ లేదు. తప్పుడు నెగెటివ్ ఫలితం వచ్చిందని క్యాన్సర్ లేదని పూర్తిగా నమ్మకూడదు. ముఖ్యంగా పెద్దపేగు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, ఊపిరితిత్తుల క్యాన్సర్ల కోసం ప్రస్తుతం సిఫారసు చేస్తున్న పరీక్షలను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి ప్రారంభ దశలో క్యాన్సర్ను గుర్తించడమే కాకుండా, క్యాన్సర్ వల్ల మరణించే ప్రమాదాన్ని తగ్గిస్తాయని నిరూపితమైంది. కొత్త పరీక్షలపై ఆశలు పెట్టుకున్నప్పటికీ, నిరూపితమైన క్యాన్సర్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవడమే ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

డిసెంబర్ నుంచి డేంజర్ బెల్స్..



హైదరాబాద్, : అప్పట్లో 2002 సంవత్సరం.. ఇప్పటికీ ఆ కరువు కరాళనృత్యం అందరి మదిలో ఉంది. తెలుగునాట తీవ్రమైన కరువొచ్చింది.. నీళ్ల కోసం బిందెలు సైకిళ్లకు కట్టుకొని పొలాల వద్దకు వెళ్లి మిగిలిన కాసిన్ని నీటిని తెచ్చుకొని జనాలు తమ అవసరాలు తీర్చుకున్న పరిస్థితి. అప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా బిందెలు మోస్తూ వెళుతున్న దృశ్యాలే.... రైతులు అయితే పిట్టల్లా రాలారు. కరెంట్ లేక, తాగునీటి సౌకర్యం లేక జనాలు హరిగోస పడ్డారు. అంతటి తీవ్రమైన కరువు ఇప్పుడు ఎల్ నినోతో మరోసారి రాబోతోంది. ఈసారి హైదరాబాద్ మహానగరానికి అది పొంచి ఉంది. డిసెంబర్ నుంచే ఆ డేంజర్ బెల్స్ మోగనున్నాయి. హైదరాబాద్ ప్రజల గొంతులో ఇప్పుడు పచ్చి వెలక్కాయ పడింది. వేసవి దాహార్తి గురించి మనం ప్రతీ ఏడాదీ వింటూనే ఉంటాం.. కానీ ఈసారి వేసవి రావాల్సిన అవసరం కూడా లేదేమో అనిపిస్తోంది. చలికాలం ముగిసేలోపే అంటే సరిగ్గా డిసెంబర్ నెల నుంచే హైదరాబాద్కు 'కన్నీటి' కష్టాలు మొదలు కానున్నాయనే వార్త తెలంగాణ ప్రజలను.. ముఖ్యంగా నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఒకప్పుడు నిండుగా ప్రవహించే చెరువులు.. కుంటలతో కళకళలాడిన హైదరాబాద్ తాగునీటి వనరులు ఇప్పుడు బొట్టు నీటికి కూడా అల్లాడే పరిస్థితి దాపురిస్తోంది. హైదరాబాద్కు ప్రధానంగా తాగునీటిని అందించే సింగూరు.. మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు మునుపెన్నడూ లేనంతగా క్షీణించి పోతున్నాయి. డిసెంబర్ నాటికి ఈ రిజర్వాయర్లలో నీటి మట్టం కేవలం 10 శాతానికి పడిపోయే ప్రమాదం ఉందన్న జలమండలి అంచనాలు గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఈ నీటి సంక్షోభం ప్రభావం ప్రధానంగా పశ్చిమ హైదరాబాద్లోని ఐటీ సిటీలో భాగమైన హైటెక్ సిటీ, గచ్చిబౌలి, కొండాపూర్, నార్సింగి, కోకాపేట వంటి ఐటీ హబ్లపై దారుణంగా పడనుంది. శేరిలింగంపల్లిలో ఏకంగా 80 శాతం.. జూబ్లీహిల్స్లో 50 శాతం వరకు నీటి సరఫరా నిలిచిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రోజుకు సుమారు 10 కోట్ల గ్యాలన్ల నీటి లోటు ఏర్పడితే.. ఉదయాన్నే లేచి కుళాయి తిప్పితే చుక్క నీరు రాకపోతే.. పిల్లలను స్కూళ్లకు.. ఉద్యోగాలకు పంపే కుటుంబాల పరిస్థితి ఎంత నరకప్రాయంగా మారుతుందో ఊహించుకోవడానికే భయమేస్తోంది. రూ. కోట్లు వెచ్చించి కొనుక్కున్న ఫ్లాట్లు.. 40 అంతస్తుల విలాసవంతమైన ఫ్లాట్లు ఉన్నా.. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు లేకపోతే ఆ అభివృద్ధికి అర్థమేముంది? వందల అడుగులు తవ్వినా భూగర్భ జలాలు ఊరని పరిస్థితి నెలకొంటుంది.. రోజువారీ అవసరాల కోసం ట్యాంకర్ల వెంట బకెట్లతో పరుగులు తీయాల్సిన దుస్థితి వస్తే సామాన్య.. మధ్యతరగతి కుటుంబాల బతుకులు మరింత భారమవుతాయి. కనీస అవసరమైన మంచి నీరు కూడా ఖరీదైన వ్యాపారంగా మారిపోకముందే.. ప్రభుత్వం, జలమండలి అధికారులు తక్షణమే స్పందించాలి. ప్రత్యామ్నాయ గోదావరి జలాల తరలింపు వేగవంతం చేసి.. లీకేజీలను అరికట్టి నగర దాహార్తిని తీర్చకపోతే.. నగరంలో వికాసం కాదు.. వినాశనమే మిగులుతుంది. ఎందుకంటే ఎన్ని ఫ్లైఓవర్లు కట్టినా.. ఎన్ని ఆకాశహర్మ్యాలు నిర్మించినా చివరకు మనిషికి కావాల్సింది గుక్కెడు మంచినీళ్లే..

ట్రూ అప్ ఛార్జీలు కూడా ఫ్రీ, 54.79 లక్షల మందికి ఊరట

హైదరాబాద్, : తెలంగాణలో గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ పొందుతున్న 54.79 లక్షల కనెక్షన్లకు ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లించనుంది. గతంలో విద్యుత్ వినియోగం 200 యూనిట్లు దాటినా.. ప్రస్తుతం పథకం అర్హత ఉంటే ఈ మినహాయింపు వర్తిస్తుంది. దీంతో లబ్ధిదారులకు జీరో బిల్లులు కొనసాగనున్నాయి. ఈ నిర్ణయం వల్ల వచ్చే రెండేళ్లలో ప్రభుత్వంపై సుమారు రూ.500 కోట్ల అదనపు భారం పడనుంది.తెలంగాణలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఊరటనిచ్చింది. ఉచిత విద్యుత్ పథకం కింద నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే కుటుంబాలపై ట్రూఅప్ ఛార్జీల భారం పడకుండా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద అర్హత పొందిన 54,79,383 విద్యుత్ కనెక్షన్లకు ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే డిస్కంలకు చెల్లించనుంది. దీంతో ఈ నెల నుంచి అన్ని వర్గాల విద్యుత్ వినియోగదారుల బిల్లుల్లో ట్రూఅప్ ఛార్జీలు అదనంగా చేరుతున్నప్పటికీ గృహజ్యోతి లబ్ధిదారులకు మాత్రం యథావిధిగా జీరో బిల్లులే జారీ అవుతున్నాయి.సాధారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో వినియోగించిన విద్యుత్కు సంబంధించిన ట్రూఅప్ ఛార్జీలను ఇప్పుడు వసూలు చేస్తున్నాయి. ఈ నెల బిల్లులో యూనిట్కు 30 పైసలు చొప్పున, వచ్చే నెల నుంచి యూనిట్కు 50 పైసల చొప్పున మొత్తం 24 నెలలపాటు ఈ మొత్తాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నాయి. అయితే గృహజ్యోతి పథకం కింద ప్రస్తుతం ఉచిత విద్యుత్ పొందుతున్న కుటుంబాలకు ఈ భారం వర్తించకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గతంలో 2022-23, 2023-24 సంవత్సరాల్లో నెలకు 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించినప్పటికీ ప్రస్తుతం గృహజ్యోతి పథకం అర్హత కలిగిన వినియోగదారుల ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరిస్తుందని డిస్కంలు స్పష్టం చేశాయి.ఈ నిర్ణయంతో గృహజ్యోతి పథకం అమలుకు ప్రభుత్వంపై ఆర్థిక భారం మరింత పెరగనుంది. 2024లో ఈ పథకం ప్రారంభమైన సమయంలో నెలకు సుమారు రూ.170 కోట్లను ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లించేది. ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య, విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ఆ మొత్తం నెలకు రూ.210 కోట్లకు చేరింది. తాజాగా ట్రూఅప్ ఛార్జీలను కూడా ప్రభుత్వమే భరించనుండటంతో ఈ నెలలో అదనంగా రూ.16 కోట్లకు పైగా చెల్లించాల్సి వస్తుందని అంచనా వేస్తున్నారు. వచ్చే 24 నెలల్లో గృహజ్యోతి లబ్ధిదారులకు సంబంధించిన ట్రూఅప్ ఛార్జీల రూపంలో ప్రభుత్వం సుమారు రూ.500 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని డిస్కంల వర్గాలు వెల్లడిస్తున్నాయి.మరోవైపు గృహజ్యోతి పథకానికి కొత్త లబ్ధిదారులు కూడా పెరుగుతున్నారు. రేషన్కార్డు ఉండి, అర్హతలు కలిగి ఉన్నప్పటికీ ఇప్పటివరకు జీరో బిల్లు అందని కుటుంబాల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో ఈ పథకం పరిధిలోకి వచ్చే విద్యుత్ కనెక్షన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తంగా ఉచిత విద్యుత్తో పాటు ట్రూఅప్ ఛార్జీల భారాన్ని కూడా ప్రభుత్వం భరించనుండటంతో లక్షలాది కుటుంబాలకు విద్యుత్ బిల్లుల విషయంలో అదనపు ఊరట లభించనుంది.

యువతకు పంజాబ్ సర్కారు క్విజ్ పోటీ.. విజేతకు రూ.కోటి బహుమతి..!



పంజాబ్ : పంజాబ్ యువతకు ఆ రాష్ట్ర ప్రభుత్వం క్విజ్ పోటీ పెట్టనుంది. ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. క్విజ్ పోటీ నిర్వహణ పెద్ద విషయం కాకపోయినా ఆ పోటీలో గెలిచిన వారికి రూ.కోటి బహుమతి ఇస్తామని ప్రకటనలో పేర్కొనడం ఆసక్తికరంగా మారింది. రాష్ట్రంలోని యువతను ప్రోత్సహించడానికి 'పంజాబ్ దా కరోడ్పతి ' అనే క్విజ్ పోటీని ప్రారంభించినట్లు సీఎం భగవంత్ మాన్ పంజాబ్ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక అంశాలు, గణితం, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విషయాలపై ప్రశ్నలు ఉంటాయని పంజాబ్ సీఎం తెలిపారు. ఇందులో విజేతకు రూ.1 కోటి నగదు బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. రన్నరప్లుగా నిలిచిన నలుగురికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున బహుమతులు ఇస్తామన్నారు. ఇందులో పాల్గొన్న దాదాపు 10 వేల మంది యువతకు ఇతర బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 15-30 ఏళ్ల మధ్య వయస్సుగల యువతీయువకులు అందరూ ఈ పోటీలో పాల్గొనవచ్చని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ తెలిపారు. ఇందుకోసం పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల పేర్లను నమోదు చేయాలని సూచించారు. ఈ క్విజ్లో మొత్తం 11 రౌండ్లు ఉంటాయి. వాటిలో తొమ్మిది రౌండ్లు ఆన్లైన్ పోర్టల్ ద్వారా, రెండు రౌండ్లు ప్రత్యక్షంగా జరుగుతాయి. టీవీ క్విజ్ షో 'కౌన్ బనేగా కరోడ్పతి' తరహాలోనే ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు నాలుగు ఆప్షన్లు ఉంటాయి. పదో రౌండ్ 23 జిల్లాల్లో నిర్వహిస్తారు. అక్కడి టాపర్లు గ్రాండ్ ఫైనల్కు అర్హత సాధిస్తారు. ఫైనల్లో ఒకరిని విజేతగా ప్రకటిస్తారు.


తుంగతుర్తిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

తుంగతుర్తి, నవంబర్ 14 : తుంగతుర్తి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మల్లెపాక సాయిబాబా ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం అయన మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి సమాజ నిర్మాతలని, దేశ భవిష్యత్కు పునాది వంటి వారని, బాల్య దశలోనే గ్రహణ సామర్థ్యం, నేర్చుకునే స్వభావం అధికంగా ఉంటుందని అన్నారు. బాల్యం దేవుడిచ్చిన వరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ రేణుక, ఆశ వర్కర్ సునీత, రామాచారి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఎన్నికలను వాయిదా వేయించేందుకు జగన్ కుట్రలు పన్నారు

బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని జగన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్న కలిశెట్టి

వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికల్లో తీవ్ర దౌర్జన్యాలు జరిగాయని వెల్లడి



అమరావతి, : వైసీపీ అధినేత జగన్ పై విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రౌడీ మూకలను ప్రోత్సహించి, అల్లర్లు సృష్టించడం ద్వారా ఎన్నికలను వాయిదా వేయించాలని జగన్ కుట్రలు పన్నారని ఆయన ఆరోపించారు. అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్ద ఎత్తున దౌర్జన్యాలు, అక్రమాలు జరిగాయని ఎంపీ కలిశెట్టి పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో ఎన్నికలు ఎంతో ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని, దీనిని చూసి ప్రజలు హర్షిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రజలు శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకుంటుంటే, ఓర్వలేక ప్రత్యర్థి పార్టీ అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని ఆంధ్రప్రదేశ్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఎంపీ ఆరోపించారు. తాడేపల్లి నివాసానికి జగన్ ఎప్పుడో ఒకసారి అతిథిలా వస్తూ, కేవలం ప్రెస్ మీట్లు పెట్టి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. వైసీపీ చేస్తున్న కుట్రలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇదే సమావేశంలో, విశాఖపట్నంలో సీఐఐ పెట్టుబడుల సదస్సు విజయవంతం కావడంపై ఎంపీ హర్షం వ్యక్తం చేశారు.

నిన్ననే ప్రపంచం అంతమవ్వాల్సింది..

1960లో శాస్త్రవేత్తల సంచలన అంచనా ఇదే!

- 1960లో ప్రచురితమైన ఓ పరిశోధన పత్రం

- 2026 నవంబర్ 13న ప్రపంచ జనాభా అనంతానికి చేరుకుంటుందని అంచనా

- జనాభా రెట్టింపయ్యే సమయం తగ్గుతున్న ధోరణి ఆధారంగా ఈ లెక్కలు

- అయితే 1993 నుంచి జనాభా పెరుగుదల మందగించడంతో తప్పిన అంచనా

- ఐరాస లెక్కల ప్రకారం ప్రస్తుతం ప్రపంచ జనాభా 820 కోట్లే



1960లో 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమైన ఓ పరిశోధన పత్రం ప్రకారం.. 2026 నవంబర్ 13న ప్రపంచ జనాభా అనంతానికి చేరుకోవాలి. అయితే ఆ అంచనా ఎందుకు నిజం కాలేదు? ఆ రోజు రానే వచ్చింది. ఆరు దశాబ్దాల క్రితం ఓ శాస్త్రీయ పరిశోధనలో ప్రపంచం అంతమయ్యే తేదీగా పేర్కొన్న 2026 నవంబర్ 13 వెళ్లిపోయింది. అయితే ఈ అంచనా వెనుక గ్రహశకలం ఢీకొనడం, యుద్ధం, ప్రకృతి విపత్తు వంటి కారణాలేవీ లేవు. ప్రపంచ జనాభా విపరీతంగా పెరుగుతుందన్న గణిత లెక్కలే దీనికి ఆధారం.

1960లో వెలువడిన పరిశోధన: భౌతిక శాస్త్రవేత్త హీంజ్ వాన్ ఫోర్స్టర్, ఆయన సహచరులు ప్యాట్రిసియా ఎం.మోరా, లారెన్స్ డబ్ల్యూ. అమియో కలిసి ఈ పరిశోధన చేశారు. 1960 నవంబర్ 4న 'సైన్స్' జర్నల్‌లో ఇది ప్రచురితమైంది. 'డూమ్స్‌డే: ఖైడే, నవంబర్ 13, ఏ.డి. 2026' అనే శీర్షికతో ఈ పత్రం వెలువడింది.

జనాభా రెట్టింపయ్యే సమయం తగ్గుతోందని..: క్రీస్తుపూర్వం 400 నుంచి 1958 వరకు ప్రపంచ జనాభా గణాంకాలను పరిశోధకులు పరిశీలించారు. జనాభా రెట్టింపు కావడానికి పడుతున్న సమయం క్రమంగా తగ్గుతున్నట్లు గుర్తించారు. ఇదే ధోరణి కొనసాగితే ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు ఓ గణిత సూత్రాన్ని రూపొందించారు. దాని ప్రకారం 2020 నాటికి ప్రపంచ జనాభా 2500 కోట్లను దాటుతుందని, 2026 నాటికి అనంతానికి చేరుకుంటుందని అంచనా వేశారు.

హెచ్చరికే కానీ.. ప్రపంచ వినాశనం కాదు: ఈ అంచనా ప్రకారం భవిష్యత్తులో జనాభా పెరుగుదల భరించలేని స్థాయికి చేరుకుంటుందని పరిశోధకులు హెచ్చరించారు. జనాభా పెరుగుదల ఇదే వేగంతో కొనసాగితే మనుషులు ఆకలితో చనిపోరని, జనసాంద్రత కారణంగా నలిగిపోతారని వ్యాఖ్యానించారు. ఈ వాదనలు అప్పట్లో విస్తృత చర్చకు దారితీశాయి. రాజకీయ చర్చల్లోనూ ప్రస్తావనకు వచ్చాయి.

ఎందుకు నిజం కాలేదు?: ఆ మోడల్ సుమారు 30 ఏళ్ల వరకు వాస్తవ జనాభా పెరుగుదలతో సరిపోలింది. అయితే 1993 నుంచి వాస్తవ జనాభా అంచనాల కంటే తక్కువగా నమోదవడం మొదలైంది. ప్రపంచవ్యాప్తంగా జననాల రేటు తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం అది 1960లో ఉన్న స్థాయిలో సగం కంటే తక్కువగా ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ప్రస్తుతం ప్రపంచ జనాభా సుమారు 820 కోట్లు మాత్రమే. కానీ ఆ గణిత సూత్రం ప్రకారం 2025 నాటికే జనాభా 1,310 కోట్లకు చేరుకోవాల్సి ఉంది. వాన్ ఫోర్స్టర్ 1911 నవంబర్ 13న జన్మించారు. ఆయన 115వ పుట్టినరోజు కూడా నిన్నే. జనాభా పెరుగుదల నిరంతరం కొనసాగలేదని, దాని ప్రభావాలను ముందుగానే గుర్తించాలని హెచ్చరించడమే ఆ పరిశోధన ప్రధాన ఉద్దేశం. ప్రపంచం అంతమవుతుందనే శాస్త్రీయ ఆధారాలు లేవు.

తిరుమల శ్రీవారి భక్తులకు శుభవార్త..

తిరుమల శ్రీవారి భక్తుల కోసం సద్గమయ కార్యక్రమం

డిసెంబర్ 20 నుంచి ఆన్‌లైన్ కార్యక్రమానికి శ్రీకారం

ఐదు భాషల్లో రామాయణం, మహాభారతం, భగవద్గీత



తిరుమల: తిరుమల శ్రీవారి భక్తుల కోసం టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబరు 20న వైకుంఠ ఏకాదశి పర్వది నం నుంచి సద్గమయ పేరుతో ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ప్రారంభిం చనుంది. ఈ సద్గమయ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా పోర్టల్‌ను టీటీడీ రూపొందించింది. సామాన్య భక్తులకు సైతం రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి మహోన్నత గ్రంథాల్లోని ముఖ్యమైన అంశాలు అర్థమయ్యే రీతిలో రోజూ ఆన్‌లైన్ ద్వారా అందించనుంది. టీటీడీ తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, ఆంగ్ల భాషలను ఎంపిక చేసింది. ఈ సద్గమయ కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ పోర్టల్‌లో రూ. 5 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ముందుగా టీటీడీ శ్రీవారి సేవకుల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించాలని టీటీడీ నిర్ణయించింది. అనంతరం దేశ, విదేశాల్లోని భక్తులకు విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ ఇతిహాస పాఠాలకే పరిమితం చేయకుండా.. వాటిపై అవగాహన పెంపొందించేందుకు రోజూ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని కూడా నిర్వహించనుంది. అంతేకాదు అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురిని లక్కీడిప్ పద్ధతిలో ఎంపిక చేయనుంది. వీరికి కుటుంబ సభ్యులతో కలసి శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తారు. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు పెద్ద శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్లు తిరుమాడ వీధుల్లో దర్శనమివ్వగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సర్వరాజైన ఆదిశేషువు జగన్నాథునికి నివాస భూమిగా, తల్పంగా, సింహాసనంగా స్వామివారికి విశేష సేవలందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి సహస్రనామాలతో శేషసాయి, శేషస్తుత్యం, శేషాద్రి నిలయం అంటూ నిత్య పూజలు అందుకుంటున్నాడు. అటు రామావతారంలో లక్ష్మణుడిగా, కృష్ణావతారంలో బలరాముని గా స్వామివారికి అత్యంత సన్నిహితునిగా వ్యవహరించే ఆదిశేషువు శ్రీవైకుంఠంలోని నిత్యసూరులలో ఆద్యుడు. ఈ విధంగా స్వామివారు దాసభక్తికి మారు రూపంగా నిలిచే తన ప్రియ భక్తుడైన శ్రీ ఆదిశేషుడిపై ఉభయ దేవేరులతో కలిసి ఊరేగుతూ భక్తులకు అభయమివ్వడమే కాకుండా శరణాగతి ప్రపత్తిని సాక్షాత్కరింపజేస్తున్నాడు. అందుకే స్వామివారు బ్రహ్మోత్సవ వాహన సేవలలో కూడా తొలి ప్రాధాన్యత ఆదిశేషునికే ఇచ్చాడు.

ఏపీలో హైవే పక్కనున్న రైల్వే స్టేషన్‌లో..

రోజుకు ఒక్క రైలే ఆగుతుంది..

పామిడి రైల్వే స్టేషన్‌లో ఒక్క రైలే ఆగుతుంది

సరైన రోడ్డు మార్గం కూడా లేదంటున్నారు

హైవే పక్కనే ఉన్నా చాలామందికి తెలియదట




అనంతపురం : అనంతపురం జిల్లాలో ఓ రైల్వే స్టేషన్‌కు విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. రైల్వే స్టేషన్‌ను కోట్లాది రూపాయలతో నిర్మించినా ఉపయోగం లేకుండా పోయిందనే విమర్శలు వస్తున్నాయి. నేషనల్ హైవే 44కు పక్కనే ఉన్నా సరే ఆ రైల్వే స్టేషన్ నిర్వహణ లోపంతో ప్రయాణికులు లేక వెలవెలబోతోంది. అనంతపురం జిల్లా పామిడి రైల్వే స్టేషన్‌ను నిర్మించారు.. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్లాట్‌ఫామ్‌పై టైల్స్ పనుల వరకు పరిమితమయ్యారు. పామిడి పట్టణం నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని ఈ స్టేషన్ నేషనల్ హైవే 44 నీలూరు రోడ్డు పాయింట్ నుంచి సుమారు 2 కిలోమీటర్లు పొలాల మధ్య మట్టిదారే మాత్రమే ఉంది. సరైన దారి లేకపోవడంతో వర్షాలు వడినా వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయంటున్నారు. పామిడి రైల్వే స్టేషన్‌కు సరైన దారి కూడా లేదని ప్రయాణికులు రావడం లేదని స్థానికులు అంటున్నారు. ఇక్కడ ఒక్క టికెట్ తీసుకోవడానికి నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. కేవలం ఒక్క ప్యాసింజర్ రైలు మాత్రమే ఆగుతుండటం (వచ్చి వెళుతోంది)తో పాటుగా.. రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ఆటోలు లేకపోవడంతో పామిడి వాసులు ఇబ్బందిపడుతున్నారు. వారంతా అనంతపురం, గుత్తి రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సి వస్తోంది. నేషనల్ హైవే 44 నుంచి రైల్వే స్టేషన్‌కు తారు రోడ్డు వేసి ఆటోలు తిరిగితే పామిడి స్టేషన్‌కు ప్రయాణికులు వస్తారంటున్నారు. అలాగే ప్యాసింజర్‌తో పాటు ధర్మవరం-మచిలీపట్నం, కాచిగూడ-యశ్వంత్‌పూర్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పామిడి రైల్వే స్టేషన్‌కు హాల్ట్ కల్పిస్తే ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు.

ప్రస్తుతం ఈ స్టేషన్‌లో రోజువారీగా హిందూపురం – గుంతకల్లు డెము (77214) ఉదయం 09:36 గంటలకు వస్తుంది.. అలాగే గుంతకల్లు – హిందూపురం డెము (77213) సాయంత్రం 05:02 గంటకు వస్తుంది. ఈ మార్గంలో ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైళ్లు పామిడి స్టేషన్ మీదుగా వెళ్తాయి కానీ.. ఇక్కడ ఆగవు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎక్కాలంటే సమీపంలోని గుత్తి లేదా అనంతపురం స్టేషన్లకు వెళ్లాల్సి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. పామిడి రైల్వే స్టేషన్‌లలో వీలైనన్ని రైళ్లకు హాల్ట్ వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

చిత్తూరు ఇంజినీరింగ్ విద్యార్థినిది..

ఆత్మహత్యాయత్నం కాదు..



చిత్తూరు ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థిని ఘటన

విద్యార్థినిది ఆత్మహత్యాయత్నం కాదన్న ఫ్యాక్ట్ చెక్ టీమ్

విద్యార్థినిది కడుపు నొప్పి, కిడ్నీలో రాళ్ల సమస్యని క్లారిటీ

చిత్తూరు :చిత్తూరులోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసిందంటూ రెండు, మూడు రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడం వల్ల ఫీజు చెల్లించలేక ఆత్మహత్యాయత్నం చేసిందంటూ ఆరోపణలు వచ్చాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా ఈ అంశంపై స్పందించారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారని విమర్శించారు. వెంటనే మంత్రి లోకేష్‌ను విద్యాశాఖ బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. కాలేజీల్లో విద్యార్థులపై ఒత్తిళ్లను వెంటనే ఆపాలి. విద్యార్థి ఆత్మహత్యాయత్నాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మాని బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ ఆరోపణలపై ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్ట్ చెక్ టీమ్ స్పందించింది. తప్పుడు ప్రచారం జరుగుతోందని ట్వీట్ చేసింది.చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో.. బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు, ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడం వల్ల కళాశాలకు ఫీజు చెల్లించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని.. అందులో ఒక విద్యార్థిని మరణించినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఆ కళాశాలకు చెందిన ఒక విద్యార్థిని కడుపు నొప్పి, కిడ్నీలో రాళ్ల సమస్యతో తీవ్ర నొప్పిని అనుభవిస్తూ చికిత్స కోసం ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. ఆ కళాశాలలో ఎక్కడా ఏ విద్యార్థిని లేదా విద్యార్థి కూడా ఆత్మహత్యాయత్నం చేయలేదని పోలీసుల విచారణలో తేలిందన్నారు.విద్యార్థిని ఆరోగ్య విషయంపై ఆ కళాశాలకు చెందిన విద్యార్థులు ఆందోళన చెందుతున్నారనే సమాచారం తెలియగానే చిత్తూరు పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. ఈ అంశంపై పూర్తిగా విచారణ జరిపి పూర్తి వివరాలు తెలుసుకున్న అనంతరం, ఆందోళన చేస్తున్న విద్యార్థులకు అసలు విషయం తెలిపారన్నారు. అంతే తప్ప సంబంధిత కళాశాలలో ఏ విద్యార్థి లేదా విద్యార్థిని కూడా ఆత్మహత్యాయత్నం చేయలేదన్నారు. అలాగే కాలేజీలో చదువుతున్న విద్యార్థినుల పేర్లను ఉటంకిస్తూ, వారి గోప్యతకు భంగం కలిగిస్తూ అసత్య ప్రచారం చేయడం క్షమించరాని నేరమన్నారు. వాస్తవాలు నిర్ధారించుకోకుండా ప్రజల్లో అపోహలు కలిగించే విధంగా తప్పుడు ప్రచారం చేయడం సబబు కాదన్నారు.

ఉదయం 10 నుంచి 5 గంటల వరకే..

50 వేల మందికి మించకూడదు..



ఢిల్లీ :దేశ రాజధాని ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో నిర్వహించే నిరసనలు, బహిరంగ సభలను నియంత్రించేందుకు పోలీసులు కొత్త ముసాయిదా మార్గదర్శకాలు రూపొందించారు. ఈ ప్రతిపాదనల ప్రకారం.. నిరసనలు ఏడు గంటలకు మించకూడదు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు, నిరసనకారులపై కూడా పరిమితి విధించారు. 50 వేల కంటే ఎక్కువ మంది నిరసనల్లో పాల్గొనడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. వేదిక వద్ద భద్రత, రక్షణ ఏర్పాట్ల కోసం ఏకరీతి విధానాన్ని ఏర్పాటుచేయడానికి ఈ స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ తీసుకొచ్చారు. ఇది ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉందని, ఆమోదం కోసం ఢిల్లీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు పంపారని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఈ నిబంధనలు ఇంకా ఖరారు కావాల్సి ఉంది.అక్టోబరు 11న జంతర్ మంతర్‌ను ఢిల్లీ పోలీసులు నిరసనల వేదికగా రద్దుచేసి, దీనికి ప్రత్యామ్నాయంగా రామ్‌లీలా మైదానం, బురారీ, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్స్‌ను ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తాజా మార్గదర్శకాలు తెరపైకి వచ్చాయి. కేంద్ర హోంశాఖ ప్రత్యేక కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మూడు వేదికలకు సంబంధించి సమగ్రమైన విధివిధానాలను జారీచేస్తామని పోలీసులు అప్పట్లో తెలిపారు.పోలీసుల అనుమతి కోసం నిర్వాహకులు దరఖాస్తు చేసుకునే ముందు, మైదానం అందుబాటులో ఉందని ధ్రువీకరిస్తూ ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి క్లియరెన్స్ పొందాల్సి ఉంటుంది. సాధారణంగా ప్రతిపాదిత కార్యక్రమానికి కనీసం 10 రోజుల ముందు దరఖాస్తులను సమర్పించాలి. సభను నిర్వహించడం, ట్రాఫిక్ అధికారులతో సమన్వయం చేసుకోవడం నిర్వాహకులదే బాధ్యత. వారు పార్కింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు, పాల్గొనేవారిని దింపే ప్రదేశాలను గుర్తించాలి. రహదారులు, అత్యవసర మార్గాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవాలి.మైదానంలోకి తుపాకులు, కత్తులు, బల్లేలు, పదునైన వస్తువులు, ఇతర ప్రమాదకర వస్తువులను తీసుకురావడం పూర్తిగా నిషేధం. మైదానం పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌లను ఎగురవేయడానికి కూడా ముందస్తు అనుమతి తప్పనిసరి. నిర్వాహకులు తాగునీరు, వైద్య సహాయం, పారిశుధ్య సౌకర్యాలను కల్పించడంతో పాటు, వ్యర్థాలను సరిగ్గా తొలగించే ఏర్పాట్లు కూడా చేయాల్సి ఉంటుంది.

కేసీఆర్ పెనుముప్పు నుంచి రక్షించారు..



హైదరాబాద్: కవితను పార్టీ నుంచి బహిష్కరించినందుకు కేసీఆర్‌కు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. దుర్మార్గమైన దోపిడీ, పెనుముప్పు నుంచి రక్షించారని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి సౌజన్యంతో పాంచజన్యం ఎజెండాతో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేశారు, ఆధారాలు ప్రజల ముందు బయటపెడతానన్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికార పక్షం దోపిడీ నిరంతరంగా సాగుతోంది. ఎన్ని కేసులు పెట్టినా, ఇబ్బంది పెట్టినా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

అధికార పక్షంపై దోపిడీ చేయాల్సిన కవిత... బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తున్నారు. తండ్రి కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్ రావును విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ కు నాలుగో అనుబంధ సంస్థగా టీఆర్ఎస్, రేవంత్ రక్షణ సేనగా పనిచేస్తోంది. కేటీఆర్, హరీశ్ రావుపై నిత్యం గళమెత్తుతున్న టీఆర్ఎస్... కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థ కాకపోతే మరేమిటి..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. 2012లో ఆడి కోర్ ఇన్ ఫ్రా కంపెనీకి రేవంత్ రెడ్డి డైరెక్టర్, 2010 లో కవిత డైరెక్టర్, సూదిని సృజన్ రెడ్డి ఇంకో డైరెక్టర్... ఇది కల్పితం కాదు. రూ.1000 కోట్ల కాలువ పని సృజన్ రెడ్డికి వచ్చే వరకు కవిత వదల్లేదు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు భూకంపం వచ్చిన ప్రాంతంలో నిర్మించారని కవిత అన్నారు. కేంద్ర జలసంఘం, జీఎస్ఐ నుంచి అనుమతులు వచ్చిన తర్వాతే 50 టీఎంసీల జలాశయం కట్టాలని నిర్మించారు.కేసీఆర్ ఆదేశాలు, హరీశ్ రావు పర్యవేక్షణలో ఇంజనీర్లు నిర్ణయం తీసుకున్నారు విజిలెన్స్ విభాగం నివేదికలను సీఎంకు పంపుతుంది కానీ, రహస్యంగా తయారు చేసిన ఆ నివేదికలు కవితకు ఎలా వచ్చాయి..? రేవంత్ రెడ్డి ఇచ్చినట్లే కదా... అధికారిక రహస్యాల ఉల్లంఘన కాదా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. 19న సిద్దిపేటలో సీఎం ఈ అంశాలనే మాట్లాడతారు.. రేవంత్ రెడ్డి కవితను సిద్దిపేటకు వెళ్లమని చెప్పారు, స్క్రిప్ట్ ఇచ్చారు... అవే మళ్లీ మాట్లాడతారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. కవితకు కామన్ సెన్స్ లేకపోవడం నవ్వు వస్తోందని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కొండ పోచమ్మ సాగర్ నుంచి కేసీఆర్ ఫాంహౌస్‌కు కాల్వ వెళ్లిందని అంటున్నారు. రిజర్వాయర్ కింద కేసీఆర్ భూమికి కూడా నీరు వెళ్తే కవితకు ఏం ఇబ్బంది.. ? రేవంత్ రెడ్డి స్క్రిప్ట్ ఇస్తే కవిత మాట్లాడుతున్నారు. నిమ్స్ లో హరీశ్ రావు రూ.200 కోట్ల కుంభకోణం చేశారని కవిత అన్నారు.

విజిలెన్స్ నివేదికలు కవిత వద్దకు ఎలా వెళ్తాయి..?
బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

కవిత ఉద్యోగుల పక్షమా... రేవంత్ రెడ్డి పక్షమా...?: నిమ్స్ లోని ఉద్యోగుల ఈపీఎస్ సరిగ్గా అందుకోవడంతో జీపీఎఫ్‌కు వెళ్తామని అన్నారు. పాంచజన్యం పేరుతో పచ్చి అబద్ధాలు చెప్పడంలో కవిత దిట్ట. జీపీఎఫ్ ఉద్యోగుల డబ్బులు ఈపీఎఫ్ కు ఇస్తున్నారని జీపీఎఫ్ ఉద్యోగులు కవితకు ఫిర్యాదు చేశారని అనడం విడ్డూరంగా ఉందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారు.

హరీశ్ రావు చేసిన తప్పేమిటి..? మంత్రిగా ఉద్యోగులకు ఈపీఎఫ్ ఇప్పించడం తప్పా..? ప్రస్తుత సలహాదారు రామకృష్ణారావుతోపాటు ఐఏఎస్ అధికారులు, వైద్యులు సంతకం చేశారు కదా..! పెన్షన్ వద్దు అని ఏ ఉద్యోగి అయినా ఫిర్యాదు చేస్తారా..? హరీశ్ రావును విమర్శించాలని సోయి లేకుండా మాట్లాడుతున్నారు. ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తారంటే ఎలా..? అని ప్రశ్నించారు.

నివేదికలు కవితవద్దకు ఎలావెళ్తాయి..?: కవిత పేరు చెప్పి ఆసుపత్రుల వద్దకు ఎవరైనా వస్తే... ఆసుపత్రుల ఉద్యోగులు నిలదీయాలి.. రేవంత్ రెడ్డి ఇచ్చాడు కాబట్టే... కవితకు అన్ని రికార్డులు వెళ్తున్నాయి.. లేని నివేదికలు సృష్టించే శాఖను రేవంత్ రెడ్డి సృష్టించి కవితకు అన్ని వివరాలు అందిస్తున్నారు. రేవంత్ రెడ్డి, కవిత, సృజన్ రెడ్డి కలిసి వ్యాపారాలు చేశారు. ఒకే చిరునామాతో 30 కంపెనీలు ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతల భూములపై అక్రమంగా విచారణకు జీఓ ఇచ్చారు, కాంగ్రెస్ నేతల భూములు కూడా చేర్చాలని అంటున్నాం. విజిలెన్స్ విభాగం వద్ద ఉండాల్సిన నివేదికలు కవిత వద్దకు ఎలా వెళ్తాయి..? అని ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ అడిగారు.

దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తే సహించం
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



తార్నాక,నవంబర్ 14 : కాంగ్రెస్ నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్, రాహుల్ గాంధీ పర్యటనకు వ్యతిరేకంగా శాంతియుత నిరసనలకు పిలుపునిచ్చిన తనను, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్టు చేయడాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచే తన నివాసం వద్ద పోలీసులు మోహరించి బయటకు వెళ్లకుండా అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ సమ్మిట్ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చే కార్యక్రమం కాదని, భారత అంతర్గత రాజకీయ అంశాలను విదేశీయులతో చర్చించేందుకే కాంగ్రెస్ ఈ సదస్సును నిర్వహిస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ ప్రభుత్వంపై అంతర్జాతీయంగా తప్పుడు ప్రచారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టారని విమర్శించారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలోవిఫలమైందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, రైతులకు రైతుబంధు, రైతుభరోసా అందడం లేదని ఆరోపించారు. హామీలపై రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ, యువమోర్చా కార్యకర్తలు నల్లజెండాలతో నిరసనలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. పోలీసుల నిర్బంధాలకు భయపడేది లేదని, హౌస్ అరెస్టులతో తమ ఉద్యమాన్ని అడ్డుకోలేరని రాంచందర్ రావు స్పష్టం చేశారు.


వరుస ప్రమాదాలు..
దురాజ్ పల్లి చౌరస్తాలో మరో లారీ బోల్తా..
డివైడర్ లోపంతో వరుస ప్రమాదాలు..



సూర్యాపేట,: జాతీయరహదారి-65పై చివ్వెంల మండలం దురాజ పల్లి చౌరస్తా వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఇక్కడ చేపట్టిన డివైడర్ నిర్మాణంలోని సాంకేతిక లోపాల కారణంగా నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. శనివారం ఉదయం విజయవాడ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. దురాజపల్లి చౌరస్తా వద్ద డివైడర్ నిర్మాణం సరిగ్గా లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోంది. వేగంగా వచ్చే వాహనాలు ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం: నిత్యం రద్దీగా ఉండే ఈ జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా నేషనల్ హైవే అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెను ప్రమాదం జరిగి భారీ నష్టం సంభవించకముందే అధికారులు స్పందించి, దురాజపల్లి చౌరస్తా వద్ద డివైడర్‌ను సరిచేయాలని, తగిన రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

శ్రీకాళహస్తి ఆలయంలో..
స్పై కెమెరా కళ్లజోడు కలకలం
భక్తుడిని అదుపులోకి తీసుకున్న ఎస్పీఎఫ్

- రహస్య కెమెరా ఉన్న కళ్లజోడుతో ఆలయంలోకి ప్రవేశించిన పూణె వ్యక్తి
- కెమెరా కళ్లజోడు ధరించిన భక్తుడిని గుర్తించిన అర్చకులు
- గర్భాలయ దృశ్యాలు చిత్రీకరించారా అనే కోణంలో అధికారుల విచారణ



శ్రీకాళహస్తి : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ఆలయంలో స్పై కెమెరా కళ్లజోడు కలకలం రేపింది. ఆలయ నిబంధనలను ఉల్లంఘించి కెమెరా అమర్చిన కళ్లద్దాలతో లోపలికి ప్రవేశించిన ఓ భక్తుడిని భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని పూణెకు చెందిన అంకేష్ అగర్వాల్ అనే భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తీశ్వర ఆలయ దర్శనానికి వచ్చారు. మొదట ఆయన ఆలయంలో రూ. 5,000 రుసుము చెల్లించి రాహు-కేతు నివారణ పూజ నిర్వహించారు. ఆ పూజ పూర్తయిన తర్వాత కుటుంబ సమేతంగా ప్రధాన ఆలయంలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వెళ్లారు. అమ్మవారి సన్నిధిలో దర్శనం చేసుకుంటుండగా, ఆయన కళ్లకు ఉన్న అద్దాలలో రహస్య కెమెరా (స్పై కెమెరా) అమర్చి ఉండటాన్ని అక్కడి అర్చకులు గుర్తించారు. విషయాన్ని గ్రహించిన అర్చకులు వెంటనే ఆలయ విధుల్లో ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన భద్రతా సిబ్బంది సదరు భక్తుడిని అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. శ్రీకాళహస్తి ఆలయ ప్రాంగణంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం, ముఖ్యంగా గర్భాలయం పరిసరాల్లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ చేయటంపై కఠిన నిషేధం అమల్లో ఉంది. అలాంటిది తనిఖీలను దాటుకుని స్పై కెమెరా కళ్లజోడుతో ఆలయంలోకి ఎలా రాగలిగారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఆలయ అంతరాలయంలోని సున్నితమైన దృశ్యాలను ఏమైనా రికార్డ్ చేశారా అనే కోణంలో పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.

'బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి'
- రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ



ములకలపల్లి, నవంబర్ 14 : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ములకలపల్లి మండలంలోని రాచన్నగూడెం యూపీఎస్ పాఠశాల వద్ద శుక్రవారం బాలల గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సభలో పాల్గొన్న సర్పంచ్ మడకం విజయ మాట్లాడుతూ.. నవ భారత నిర్మాణంలో, గ్రామ స్వరాజ్య సాధనలో పిల్లల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధించాలంటే గ్రామ నిర్ణయాల్లో అన్ని వర్గాలతో పాటు పిల్లల అభిప్రాయాలకు కూడా ప్రాధాన్యత కల్పించాలన్నారు. చిన్నారులకు బాల్యం నుంచే ప్రజాస్వామ్య విలువలు, బాలల హక్కులు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు బాలల గ్రామసభ అద్భుతమైన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామంలోని విద్యార్థులకు విద్యావకాశాలు, ఆటస్థలాలు, రక్షిత తాగునీరు, అంగన్వాడీ కేంద్రాల పనితీరు, బాలల రక్షణ, బాల్యవివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై నిర్ణయాలు తీసుకునే సమయంలో పిల్లల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామసభలో పిల్లలు పాల్గొనడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని, గ్రామ సమస్యలు అధికారుల దృష్టికి నేరుగా చేరుతాయని తెలిపారు. రాబోయే గ్రామసభల్లో పిల్లలు చురుగ్గా పాల్గొనేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ప్రోత్సహించాలని కోరారు. ఈ రోజు మీది పిల్లలూ.. బాగా చదువుకోవాలని, చాచా నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని గుర్తు చేశారు. నేడు విద్యార్థులుగా ఉన్న మీలోనే రేపటి సర్పంచులు, ఉపాధ్యాయులు, వైద్యులు, కలెక్టర్లు, ఉన్నత స్థాయి వ్యక్తులు ఉన్నారని అన్నారు. పిల్లల చదువులకు, అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

తుంగతుర్తిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



తుంగతుర్తి, నవంబర్ 14 : తుంగతుర్తి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మల్లెపాక సాయిబాబా ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం అయన మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి సమాజ నిర్మాతలని, దేశ భవిష్యత్‌కు పునాది వంటి వారని, బాల్య దశలోనే గ్రహణ సామర్థ్యం, నేర్చుకునే స్వభావం అధికంగా ఉంటుందని అన్నారు. బాల్యం దేవుడిచ్చిన వరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ రేణుక, ఆశ వర్కర్ సునీత, రామాచారి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

తెలంగాణ వర్కర్స్ యూనియన్ సూర్యాపేట డిపో నూతన కమిటీ ఎన్నిక

సూర్యాపేట, నవంబర్ 14 : ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ అగ్రభాగాన ఉంటుందని తెలంగాణ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు సుంకరి శ్రీనివాస్, జి,శ్రీదేవి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం శనివారం సుంకరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతూ వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ ఎన్నికల్లో నల్గొండ రీజియన్ ను తెలంగాణ వర్కర్స్ యూనియన్, ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఐక్య కూటమి కైవసం చేసుకోవడం హర్షణీయమని తెలిపారు. తెలంగాణ వర్కర్స్ యూనియన్, ఎస్ డబ్ల్యుఎఫ్ ఐక్య కూటమి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శాయ శక్తుల కృషి చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కార్యదర్శి గోపనబోయిన శ్రీనివాస్, ఆర్,ఆర్,రావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కర్స్ యూనియన్ సూర్యాపేట డిపో చైర్మన్ చైర్మన్ గా అబ్దుల్ గని, ముఖ్య సలహాదారుడిగా ఎన్.వీరయ్య, డిపో కమిటీ అధ్యక్షుడిగా పి,విప్లవ రెడ్డి, కార్యదర్శిగా మాచర్ల భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కె.అంజయ్య, అదనపు కార్యదర్శులుగా పూదూరి రమేశ్, కె.సరిత రెడ్డి, ఉపాధ్యక్షులుగా వెలుగు జానయ్య, ఎండి, యూసుఫ్, అసిస్టెంట్ కార్యదర్శులుగా కె.రవి, శీలం భాస్కర్, టి.రవీందర్, జాయింట్ సెక్రటరీలుగా ఎండి.జానీ పాషా, ఎన్ లక్ష్మి, పి.విజయ భాస్కర్, డిపో కోశాధికారిగా పి,సి శేఖర్, రీజినల్ కమిటీ సభ్యులుగా చెరుకు వెంకటయ్య, నేతి సావిత్రి, ఎం,బుచ్చయ్య ఎన్నికైన వారిలో ఉన్నారు.

కూలీ పనులు చేసి కూతురిని చదివిస్తున్న తల్లి..
యువకుడి వేధింపులకు ఆత్మహత్య..!



నారాయణపేట జిల్లా : యువకుడి వేధింపులు తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటుచేసుకుంది. నారాయణపేట జిల్లా జౌల్లాపురం గ్రామానికి చెందిన హన్మంతు--వెంకటమ్మ దంపతులు తమ కూతురు అనిత (23)ని హైదరాబాద్‌లో డిగ్రీ చదివించారు. గత ఏడాది అనిత తండ్రి హన్మంతు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. ఆ తర్వాత అనిత పీజీ చేసేందుకు అప్లై చేసింది.

కానీ తండ్రి లేకపోవడంతో తనను ఇక చదివించలేనని పెళ్లి చేస్తానని తన తల్లి చెప్పినా అనిత మాత్రం ప్రభుత్వ ఉద్యోగం వచ్చేదాకా చదువుతానని చెప్పడంతో.. అనితను ఆమె తల్లి కూలీ పనులు చేసి చదివిస్తోంది. అయితే ఈ క్రమంలో అనిత మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామానికి చెందిన అనిల్ అనే వ్యక్తితో అనిత సన్నిహితంగా ఉండేదని, అతను పెళ్లి చేసుకోమని వేధించడంతో అతన్ని దూరం పెట్టి చదువుకుంటుందని.. కానీ దూరం పెట్టినప్పటికీ అనిల్ వేధింపులు ఆగకపోవడంతో, తీవ్ర మనస్తాపంతో ఉరివేసుకుని అనిత ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానికులు పేర్కొన్నారు. ఉద్యోగం వచ్చేదాకా చదువుతానని చెప్పి మధ్యలో నన్ను వదిలేసి వెళ్లిపోయావా బిడ్డా అంటూ అనిత మృతదేహం వద్ద ఆమె తల్లి గుండెలు పగిలేలా రోదిస్తున్న దృశ్యాలు అందరినీ కంటతడి పెట్టించాయి. అనిత తల్లి ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జనగామ షూటింగ్ బాల్ జట్టు
జూనియర్ బాలికల టోర్నమెంట్‌కు క్రీడాకారుల పయనం
క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేసిన సంఘం ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్
మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలు



స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 14 : రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ జూనియర్ బాలికల టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు జనగామ జిల్లా జట్టు శనివారం అన్నారం గ్రామానికి బయలుదేరింది. ఈ నెల 14, 15, 16 తేదీల్లో మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జనగామ జిల్లా షూటింగ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్ క్రీడాకారిణులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో పోటీల్లో పాల్గొని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీలు దిలీప్‌కుమార్, సుధాకర్, సాంబరాజ్, రేణుక, మహాలక్ష్మి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.